

అప్పుఘర్‌లో ఆధునీకరణ పనులతో మూతపడిన యాత్రీనివాస్

మహిళా ఓటర్లపైనే వైసీపీ ఆశలు

గంపగుత్తగా తమకే ఓటు వేశారనే భావనలో అధికార పార్టీ అభ్యర్థులు

- స్వల్ప మెజారిటీతోనైనా బయటపడతామని ధీమా
- అంచనాలు ఏమాత్రం తప్పినా ఘోర పరాజయమేననే ఆందోళన
- 151కిపైగా సీట్లు గెలుస్తామన్న జగన్
- కానీ క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి కనిపించడం లేదంటున్న ఆ పార్టీ నేతలు
- ఆ వర్గం, ఈ వర్గం అనే భేదం లేకుండా అంతా తమకు మద్దతు ఇచ్చారంటున్న కూటమి నేతలు



ఈనెల పదమూడో తేదీన ఓటు వేసేందుకు బారులుతీరిన మహిళలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగిసి పది రోజులైంది. వచ్చే నెల నాలుగున ఓట్ల లెక్కింపు జరగబోతోంది. ఇప్పుడు ఎక్కడ చూసినా ఏ పార్టీ విజయం సాధిస్తుందనే దానిపైనే చర్చ జరుగుతోంది. వైసీపీ ప్రభుత్వ పనితీరుపై అన్ని వర్గాల్లో నెలకొన్న వ్యతిరేకత, తమ మేనిఫెస్టో విజయాన్ని చేకూర్చిపెడతాయని కూటమి నేతలు ధీమా వ్యక్తంచేస్తున్నారు. వైసీపీ నేతలు మాత్రం మహిళలంతా గంపగుత్తగా తమ పార్టీ అభ్యర్థులకే ఓటేశారని, రెండోసారి అధికారం దక్కించుకుంటామని ఆశలు పెట్టుకున్నారు. మహిళా ఓటర్లు ఏమాత్రం తమకు వ్యతిరేకంగా ఓటేసినా విజయంపై ఆశలు వదులు కోవాల్సిందేనని అంగీకరిస్తున్నారు.

వైసీపీ ప్రభుత్వ పాలనపై అన్ని వర్గాల్లోనూ ముఖ్యంగా మధ్య, ఎగువ మధ్య తరగతి, ఉద్యోగులు, నిరుద్యోగులు, యువత, వ్యాపారులు, విద్యావంతుల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడింది. ఆయా వర్గాల వారంతా వైసీపీకి వ్యతిరేకంగా ఓటేశారని ప్రచారం జరుగుతోంది. అందుకే కూటమి విజయం నల్లేరుపై నడకేనని పలు సర్వేలు తేల్చిచెబుతున్నాయి. దీనికితోడు ప్రజల్లో కూడా కూటమి విజయం ఖాయమనే ప్రచారం జరుగుతుండడంతో వైసీపీ నేతలు, అభ్యర్థుల్లో ఆందోళన నెలకొంది. అయితే ఇటువంటి తరుణంలో సీఎం జగన్మోహన్‌రెడ్డి ఈనెల 16న విజయవాడలో ఐప్యాక్ బృందంతో భేటీ అయినప్పుడు వైసీపీకి 151కిపైగా అసెంబ్లీ స్థానాలు, 22కిపైగా ఎంపీ స్థానాలు రాబోతున్నాయని ధీమా వ్యక్తం చేశారు. మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ విశాఖలో వచ్చే నెల తొమ్మిదిన రెండోసారి సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయబోతున్నారని ప్రకటించారు. దీంతో అధికార పార్టీతోపాటు అన్ని రాజకీయ పార్టీల నేతలు, ప్రజల్లో ఒక్కసారిగా చర్చ మొదలైంది. కూటమి ఏకపక్షంగా విజయం సాధిస్తుందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతున్న సమయంలో జగన్ వైసీపీకి 151కిపైగా

... మిగతా 6వ పేజీలో

జిల్లాలో పోలైన ఓట్ల వివరాలు

నియోజకవర్గం	మొత్తం ఓట్లు	పురుషులు	మహిళలు	ఇతరులు	పోలైన ఓట్లు
భీమిలి	363013	135301	140446	0	275747
విశాఖ తూర్పు	2,92,206	96,224	1,04,324	15	2,00,563
విశాఖ దక్షిణ	2,16,770	66260	71,209	5	137474
విశాఖ ఉత్తర	2,85,789	9,01,24	94,566	13	1,84,703
విశాఖ పశ్చిమ	2,13,439	71,154	77,781	7	1,48,942
గాజువాక	3,33,611	1,14,244	1,18,105	0	2,32,949
పెందుర్తి	3,07,545	1,11,970	1,16,766	4	2,28,740
జిల్లా మొత్తం	20,12,373	6,85,877	7,23,197	44	14,09,118

పర్యాటకంపై నిర్లక్ష్యం

నగరంలో ఒక్క వసతి గృహం కూడా లేని ఏపీటీడీసీ

- వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రుషికొండపై గెస్ట్ హౌస్‌లు కూల్చి సీఎం క్యాంపు కార్యాలయం కోసం భవన సముదాయం నిర్మాణం
- అధికారులకు కేటాయించేందుకంటూ అప్పుఘర్ వద్ద గల యాత్రీ నివాస్‌కు మరమ్మతులు
- ప్రైవేటు హోటళ్లను ఆశ్రయిస్తున్న పర్యాటకులు

రుషికొండపై పర్యాటక భవనాలు కూలగొట్టి నిర్మించిన భవన సముదాయాలు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం అంటే వల్లమాలిన ప్రేమ అని, అభివృద్ధిలో ఎక్కడికో తీసుకువెళ్లిపోతామని కల్లబొల్లి కబుర్లు చెబుతున్న వైసీపీ ప్రభుత్వం పర్యాటకులకు మొండి చేయి చూపిస్తోంది. వేసవి సెలవుల్లో విశాఖపట్నం వచ్చే పర్యాటకులు విడిది చేసేందుకు పర్యాటక శాఖపరంగా ఎటువంటి ఏర్పాట్లు లేవు. ఏపీ పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ)... తమ వద్ద ఎటువంటి వసతి లేదంటూ వెబ్‌సైట్‌లో 'నో ఇన్ఫర్మేషన్' అని ఫ్లాష్ మెసేజ్ డిస్‌ప్లే చేస్తోంది.

వాస్తవానికి ఇలాంటి సీజన్‌లో పర్యాటకులకు అన్నీ అందుబాటులో ఉంచి, ఆహ్వానం పలకాలి. ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి. వాహనాలు సమకూర్చాలి. కానీ విశాఖపట్నంలో ప్రస్తుతం ఎటువంటి వసతి లభించడం లేదు. ఇక్కడ ఏపీటీడీసీకి రుషికొండపై గెస్ట్‌హౌస్‌లు ఉండేవి. అక్కడి నుంచి సీవ్యూ బాగుంటుంది. దాంతో వాటికి మంచి డిమాండ్ ఉండేది. జగన్ ముఖ్యమంత్రి అయ్యాక విశాఖపట్నంపై కన్నేసి, అక్కడి నుంచి పరిపాలన చేస్తానంటూ పర్యాటక శాఖ గెస్ట్‌హౌస్‌లన్నీ కూలగొట్టేశారు. పర్యాటకులే కాకుండా స్థానికులు కూడా రుషికొండ వైపు తొంగి చూడకుండా చుట్టూ పరదాలు పెట్టేశారు. కొండకు గుండు కొట్టి, రూ.450 కోట్లతో ఆధునిక సౌకర్యాలతో ఐదు భవన సముదాయాలు నిర్మించారు. అవి సీఎం క్యాంపు కార్యాలయం కోసం అని ప్రచారం జరుగుతుంటే...ఉత్తరాంధ్ర మంత్రులు బొత్స సత్యనారాయణ, గుడివాడ అమర్‌నాథ్, పర్యాటక శాఖా మంత్రి రోజాలు మాత్రం అవి పర్యాటకుల కోసమే నిర్మించామని బుకాయించారు. మంత్రి రోజా ఎన్నికల ప్రకటనకు ముందు శారదా పీఠాధిపతితో కలిసి వాటికి ప్రారంభోత్సవం కూడా చేశారు. భవనాలు పర్యాటకుల కోసమే కట్టామని, కాకపోతే రాజధాని కమిటీ దీనిని సీఎం కార్యాలయంగా ఉపయోగించుకోవచ్చునని సూచించిందని, జగన్ అంగీకరిస్తే ఆయనకే ఇచ్చేస్తామని ఆమె సెలవిచ్చారు. అప్పటి నుంచి అవి అలాగే ఉన్నాయి.

ఏపీటీడీసీకి ఎంవీపీ కాలనీలో అప్పుఘర్ వద్ద యాత్రీ నివాస్ పేరుతో ఇంకో భవన సముదాయం ఉంది. అందులో సుమారు 44 గదులు, రెస్టారెంట్ ఉన్నాయి. పోనీ అవైనా పర్యాటకులకు అందుబాటులో ఉంచారా? అంటే...అదీ లేదు. రాజధాని ఏర్పాటైతే అందులో అధికారులకు వసతి కల్పించాలంటూ వాటికి ఆధునికీకరణ పనులు చేపట్టారు. రెండు నెలలుగా జరుగుతున్నాయి. ఇంకో రెండు, మూడు నెలల సమయం పట్టే అవకాశం ఉంది. ప్రస్తుతం పనులు జరుగుతున్నందున అక్కడ కూడా పర్యాటకులకు బుకింగ్స్ ఆపేశారు. విశాఖలో ఉన్న రెండు

... మిగతా 6వ పేజీలో

దువ్వాడ పూర్వపు సీఐపై ఫోర్జరీ కేసు

కూర్మన్నపాలెం, మే 21: దువ్వాడ పోలీస్ స్టేషన్‌లో సీఐగా పనిచేసిన శ్రీనివాసరావుపై ఫోర్జరీ కేసు నమోదైంది. ఇందుకు సంబంధించి ప్రస్తుత సీఐ ఎర్రంనాయుడు మంగళవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈ ఏడాది జనవరిలో టి.దేవాడలో పేకాట శిబిరాలపై స్టీల్‌ప్లాంటు సీఐ వి.శ్రీనివాసరావు, దువ్వాడ సీఐగా ఉన్న శ్రీనివాసరావు, గాజువాక ఎస్‌ఐ సతీశ్‌లు దాడి చేసి తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు దువ్వాడ సీఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేశారు. అయితే పేకాట శిబిరాలపై దాడిలో పాల్గొన్న అధికారుల సంతకాలు తీసుకోవాలసి ఉంది. దాడిలో పాల్గొన్న అధికారుల సంతకాలు ఎఫ్‌ఐఆర్‌పై లేకుండా వేరే సంతకాలతో కేసు నమోదుచేయడం వివాదాస్పదమైంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్టీల్‌ప్లాంటు సీఐ వి.శ్రీనివాసరావు, గాజువాక ఎస్‌ఐ సతీశ్‌ల ఫిర్యాదు మేరకు నాడు దువ్వాడ సీఐగా ఉన్న శ్రీనివాసరావుపై ఫోర్జరీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎర్రంనాయుడు తెలిపారు. ప్రస్తుతం సీఐ శ్రీనివాసరావు వీఆర్‌లో ఉన్నారు.

పెందుర్తి ప్రాంతంలో తెలంగాణ ఏసీబీ తనిఖీలు

పెందుర్తి/రోలుగుంట, మే 21: తెలంగాణ సీసీఎస్ ఏసీపీ ఉమామహేశ్వరరావు ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న ఆరోపణలు రావడంతో అక్కడి ఏసీబీ అధికారులు మంగళవారం రెండు తెలుగు రాష్ట్రాల్లో పలుచోట్ల సోదాలు నిర్వహించారు. ఈ క్రమంలో విశాఖ జిల్లా పెందుర్తి సమీపంలోని పులగాలిపాలెంలో గల ఉమామహేశ్వరరావు బంధువుల ఇంట్లో తనిఖీలు చేశారు. ఆయన ఆస్తులకు సంబంధించి కొన్ని కీలక పత్రాలు లభించినట్టు తెలిసింది. తెలంగాణ ఏసీబీ సోదాలకు సంబంధించి తమకు ఎటువంటి సమాచారం లేదని పెందుర్తి సీఐ రామకృష్ణ తెలిపారు.

అనకాపల్లి జిల్లా రోలుగుంటలోని సంతబయల వీధిలో ఉంటున్న మద్దు తమ్మునాయుడు ఇంట్లో కూడా తెలంగాణ ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. మంగళవారం ఉదయం రెండు బృందాలుగా తెలంగాణ ఏసీబీ అధికారులు గ్రామానికి వచ్చారు. తమ్మునాయుడు గురించి స్థానిక పంచాయతీ కార్యాలయ సిబ్బందిని వాకబు చేశారు. వారి సహాయంలో తమ్మునాయుడు ఇంటికి చేరుకుని మధ్యాహ్నం మూడు గంటల వరకూ సోదాలు చేశారు. ఇంట్లో ఉన్న వారి వివరాలు సేకరించారు. తమ్మునాయుడు

... మిగతా 6వ పేజీలో

స్ట్రాంగ్‌రూమ్‌లకు మరింత భద్రత

ఇప్పటివరకూ మూడంచెలు... ఇప్పుడు మరొకటి ఏర్పాటు

మొబైల్ స్క్వాడ్‌లు నియామకం

విశాఖపట్నం, మే 21 (ఆంధ్రజ్యోతి):

ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలలో ఈవీఎంలు భద్రపరిచిన గదుల (స్ట్రాంగ్‌రూమ్‌లు) చుట్టూ ఇప్పుడు నాలుగో అంచె భద్రత ఏర్పాటుచేశారు. ఈవీఎంలకు మరింత భద్రత కల్పించాలని భావించిన నేపథ్యంలో ఏయూ ఇంజనీరింగ్ కళాశాలకు చుట్టుపక్కల రెండు కిలోమీటర్ల పరిధి మేర రెడ్ జోన్‌గా నగర సీపీ ప్రకటించారు. ఆ ప్రాంతాన్ని నో ఫ్లయింగ్ జోన్‌గా పరిగణిస్తున్నందున ఎలాంటి డ్రోన్లు, బెలూన్లు ఎగురవేయరాదని ఆదేశించారు. ఈ క్రమంలోనే స్ట్రాంగ్‌రూమ్‌ల చుట్టూ ఇప్పటివరకూ మూడు అంచెల భద్రత ఉండగా...అదనంగా నాలుగో అంచె ఏర్పాటుచేశారు. నాలుగో అంచెలో మొబైల్ స్క్వాడ్‌లు బైక్‌లు, వాహనాలపై ఉదయం నుంచి సాయంత్రం వరకు కళాశాల చుట్టూ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాయి. స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద నాలుగు అంచెల్లో కలిపి సుమారు 300 మంది బందోబస్తులో ఉన్నారు. ఇంజనీరింగ్ కళాశాల లోపల స్ట్రాంగ్‌రూమ్‌లకు వెళ్లే దారిలో ముళ్ల కంచె ఏర్పాటుచేశారు. కళాశాలలో అన్ని మూలల సీసీ టీవీలు ఏర్పాటుచేసి నిరంతరం నిఘా పెట్టారు.



ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో స్ట్రాంగ్‌రూమ్‌లకు వెళ్లే మార్గంలో ఏర్పాటు చేసిన ముళ్లకంచె. (ఇన్‌సెట్) పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న కె.రఘురామకృష్ణరాజు. చిత్రంలో విష్ణుకుమార్‌రాజు, తదితరులు ఉన్నారు

కూటమికి 120-125 సీట్లు

- 4 తరువాత కాలగర్భంలోకి వైసీపీ
- ప్రతిపక్ష నాయకుడిగా జగన్ అసెంబ్లీలో కాలు పెట్టకపోవచ్చు
- ఎంపీ కె.రఘురామకృష్ణరాజు

... మెయిన్‌లో

ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు

- ఒక్కో అసెంబ్లీ సెగ్మెంట్‌కు 28 టేబుళ్లు
- పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపునకు 49 టేబుళ్లు
- టేబుల్‌కు ముగ్గురు సిబ్బంది
- పర్యవేక్షణకు పరిశీలకుల నియామకం

విశాఖపట్నం, మే 21 (ఆంధ్రజ్యోతి):

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు కోసం జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లుచేస్తోంది. పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్లు కౌంటింగ్ వేర్వేరుగా చేపట్టనున్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో పార్లమెంటు అభ్యర్థులకు లభించిన ఓట్ల లెక్కింపునకు 14, అసెంబ్లీ అభ్యర్థుల ఓట్ల లెక్కింపునకు 14 టేబుళ్లు చొప్పున ఏర్పాటుచేస్తున్నారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజక వర్గాలకు 98, పార్లమెంటు నియోజక వర్గానికి సంబంధించి ఓట్ల లెక్కింపునకు 98 టేబుళ్లు (విశాఖ ఎంపీ స్థానం పరిధిలోని ఎస్.కోట సెగ్మెంట్ ఓట్ల లెక్కింపు విజయనగరంలో, అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని పెందుర్తి ఓట్ల లెక్కింపు ఇక్కడ జరగనున్నది) ఏర్పాటుచేస్తున్నారు. అలాగే పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపునకు పార్లమెంటుకు 14 టేబుళ్లు, అసెంబ్లీ సెగ్మెంట్‌కు సగటున ఐదు టేబుళ్లు ఉంటాయి. ఓట్ల లెక్కింపునకు మొత్తం 245 టేబుళ్లు ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. ప్రతి టేబుల్‌కు ఒక మైక్రో అబ్జర్వర్, సూపర్‌వైజర్, కౌంటింగ్‌అసిస్టెంట్...మొత్తం ముగ్గురు సిబ్బందిని నియమిస్తున్నారు. దీనికి 20 శాతం అదనంగా సిబ్బందిని రిజర్వ్‌లో ఉంచుతున్నందున 800 నుంచి 825 మంది సిబ్బందిని నియమించనున్నారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా 20 వేల మంది ఉద్యోగులు ఓటు వినియోగించుకున్నారు. సర్వీస్ ఓటర్లు మూడు వేల మందిలో ఎంతమంది ఓటు వినియోగించుకున్నారో అనేది ఇంకా తెలియరాలేదు. అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా సర్వీస్ ఓటర్ల నుంచి పోస్టల్ ద్వారా బ్యాలెట్లు అందుతున్నాయి. ఇదిలావుండగా ఓట్ల లెక్కింపు విధుల్లో పాల్గొనే సిబ్బంది నియామకం, శిక్షణకు షెడ్యూల్ ఖరారు చేశారు.



ఈవీఎంల స్ట్రాంగ్‌రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

ఓట్ల లెక్కింపునకు పరిశీలకులు

వచ్చే నెల నాలుగో తేదీన జరగనున్న ఓట్ల లెక్కింపు కోసం పరిశీలకులను ఎన్నికల సంఘం నియమించింది. భీమిలికి అజయ్‌కుమార్ మిశ్రా, విశాఖ తూర్పు, దక్షిణ నియోజకవర్గాలకు అమిత్‌శర్మ, 'నార్త్'కు అభిషేక్ అగర్వాల్, విశాఖ పశ్చిమకు అమిత్‌కుమార్, గాజువాకకు అమరసేన్ రాణే, పెందుర్తికి బీడీ దేవరలు పరిశీలకులుగా వ్యవహరించనున్నారు.

ఓట్ల లెక్కింపు జరిగే కేంద్రాలు

ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలలో పలుచోట్ల వచ్చే నెల నాలుగోతేదీ నిర్వహించనున్న ఓట్ల లెక్కింపు జరగనున్నది. అసెంబ్లీ/పార్లమెంటు అభ్యర్థుల ఓట్ల లెక్కింపు వేర్వేరుగా చేపడతారు. విశాఖ

... మిగతా 6వ పేజీలో


దుర్గాలమ్మ పూజల్లో కూటమి అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్


నక్కవానిపాలెంలో దుర్గమ్మ ప్రతిమలతో ఊరేగింపు

ఘనంగా కనకదుర్గమ్మ పండగ

సీతమ్మధార, మే 21: గ్రేటర్ 24వ వార్డులో నక్కవానిపాలెం గ్రామంలో ఏడుగుళ్లలో వెలసిన బెజవాడ కనకదుర్గమ్మ మహోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి అమ్మవారికి పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. నక్కవానిపాలెం, కాంత్రినగర్, గాంధీనగర్, పీఅండ్‌టీ కాలనీ, సీతమ్మధార, టీపీటీ కాలనీ, రేసపువానిపాలెం, మద్దిలపాలెం, చైతన్యనగర్ గ్రామాల ప్రజలు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. సాయత్రంగ్రామంలో రామాలయం వద్దనున్న అమ్మవారి పెద్దింటి నుంచి ఘటాలను, అమ్మవారి ప్రతిమలను భక్తులు ఊరేగింపుగా ఏడుగుళ్ల ఆలయం వరకు తీసుకువచ్చి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పులివేషాలు, అమ్మవారి వేషాలు, పూసల డాన్స్ తదితర సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గ్రామ దొడ్డి పెద్దలు, గ్రామ కోరు కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో ఈ మహోత్సవం నిర్వహించారు.

ఘనంగా దుర్గాలమ్మ మహోత్సవం

డాబాగార్డెన్స్: జీవీఎంసీ 31వ వార్డు పరిధిలోని కృష్ణాగార్డెన్స్‌లోని శ్రీ దుర్గాలమ్మ మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి వివిధ అభిషేకాలు, ప్రత్యేక పూజాది కార్యక్రమాలను నిర్వహించారు. దక్షిణ నియోజకవర్గ కూటమి అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమ్మవారి దయతో ప్రజలంతా సుఖంగా ఉండాలని కోరుకున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వానపల్లి ఫణిగాయత్రి కుమారి, సారిపల్లి మహేష్, నాని తదితరులు పాల్గొన్నారు.

పరదేశమ్మ అమ్మవారికి పూజలు

అక్కయ్యపాలెం: విశాఖ ఉత్తర నియోజకవర్గం 42వ వార్డు తాటిచెట్లపాలెంలో గల పరదేశమ్మ అమ్మవారి పండుగ మహోత్సవం సందర్భంగా అమ్మవారిని విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కెకె రాజు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పైడి రమణ, ఆళ్ళ శివగణేష్, పోలరావు, ఆలయ కమీటి సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొనారు.

23 నుంచి దుర్గమ్మ ఉత్సవాలు

అక్కయ్యపాలెం: గ్రేటర్ 46వ వార్డు మధుసూదననగర్‌లోని లక్ష్మీగణపతి సహిత కనకదుర్గ అమ్మవారి 30వ వార్షికోత్స మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్టు గ్రామ సేవా సంఘం అధ్యక్షులు కలిమి రెడ్డి అప్పారావు, ఆలయ చైర్మన్ శీరంశెట్టి శంకరావు తెలిపారు. ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయన్నారు. గురువారం ఉదయం ఏడున్నర గంటలకు కలశ ప్రతిష్టాపనతో ఉత్సవాలు ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాస్‌శర్మ ప్రారంభమవుతాయన్నారు. 26వ తేదీ ఆదివారం ప్రధాన పండుగ ఉంటుందన్నారు. జూన్ రెండో తేది ఆదివారం మధ్యాహ్నం ఉంటుంది.

లేపాక్షి వద్ద ట్రాఫిక్ సర్కిల్ నిర్మాణంలో జాప్యం

▸▸ నిత్యం వాహనాల రాకపోకలకు కష్టాలు

జగదాంబ కూడలి, మే 21: లేపాక్షి జంక్షన్ నాలుగు రోడ్ల సర్కిల్ నిర్మాణ పనుల్లో జాప్యంతో నిత్యం ట్రాఫిక్ కష్టాలు తలెత్తుతున్నాయి. కేజీహెచ్ డౌన్ లేపాక్షి జంక్షన్ వద్ద ట్రాఫిక్ సర్కిల్‌ను రోడ్డు పనుల్లో భాగంగా జీవీఎంసీ స్మార్ట్ సిటీ అధికారులు తొలగించారు. అయితే, నాలుగునెలలుగా రోడ్డు విస్తరణ పనులు కొంత మేర చేపట్టారు. సర్కిల్‌ను మాత్రం వదిలేశారు. దీంతో నాలుగు వైపులా వాహనాల రాకపోకలతో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. దీనికి తోడు కేజీహెచ్ డౌన్ లక్కీ షాపింగ్ మాల్ వద్ద చేపట్టిన కాలువ పనులు పూర్తికాకపోవడంతో పాదచారులు సైతం ఇబ్బందులు పడాల్సివస్తోంది. జగదాంబ జంక్షన్ క్లాక్ టవర్ నిర్మాణ పనుల్లో భాగంగా మెయిన్ రోడ్డు ఆధునికీకరణ పనులను జీవీఎంసీ స్మార్ట్ సిటీ ఇంజనీరింగ్ అధికారులు చేపట్టారు. క్లాక్ టవవర్ నిర్మాణంతో పాటు అక్కడినుంచి లక్కీ షాపింగ్ మాల్ వరకు మెయిన్ రోడ్డుకు ఇరువైపులా సరిసమానంగా ఉండేలా చర్యలు తీసుకున్నారు. అయితే, లేపాక్షి వద్ద పోలీస్ సర్కిల్ నిర్మాణం పూర్తిచేయకపోవడం గమనార్హం.


అస్తవ్యస్తంగా లేపాక్షి నాలుగు రోడ్ల సర్కిల్ వద్ద ట్రాఫిక్


జగదాంబనుంచి డివైడర్ నిర్మాణానికి వేసిన ఇసుక బస్తాలు

పోలీస్ సర్కిల్ పూర్తి చేయండి: జీవీఎంసీ కమిషనర్

లేపాక్షి జంక్షన్ వద్ద పోలీస్ సర్కిల్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని జీవీఎంసీ కమిషనర్ శ్రీకాంత్ వర్మ ఇంజనీరింగ్ అధికారులు ఆదేశించారు. సోమవారం క్లాక్ టవర్ రోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. పనుల్లో జాప్యం చేయవద్దంటూ హెచ్చరించారు. లక్కీవద్ద కాలువ నిర్మాణ పనులు నత్తనడక సాగడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు సజావుగా నిర్వహించాలి

▸▸ జేసీ మయూర్ అశోక్

విశాఖపట్నం, మే 21: జిల్లాలో ఈనెల 24 నుంచి జరగనున్న పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు సజావుగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు. సార్వత్రిక విద్యాపీఠం నిర్వహించే పది, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలపై మంగళవారం తన చాంబరులో సమన్వయ సమావేశం నిర్వహించారు. మే 24 నుంచి జూన్ 3 వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరిగే సప్లిమెంటరీ పరీక్షలకు 4,836 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. ఇందులో 2,578 మంది రెగ్యులర్, 2,258 మంది ప్రైవేటు విద్యార్థులు ఉన్నారన్నారు. 20 కేంద్రాలను ఎంపిక చేయడంతో పాటు అవసరమైన సిబ్బందిని నియమించామన్నారు. ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలపై మాట్లాడుతూ సక్రమంగా జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. డీఆర్వో కె.మోహన్ కుమార్, డీఈవో ఎల్.చంద్రకళ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జేసీ మయూర్ అశోక్

అమ్మవారి ఉత్సవాల్లో రఘురామ కృష్ణరాజు

కంచరపాలెం, మే 21: రెడ్డికంచరపాలెం గ్రామ దేవత దుర్గాలమ్మ, కుంచాలమ్మ ప్రధాన పండగను గ్రామస్తులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తుమ్మడిపాలెం వద్ద అమ్మవారి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. కంచరపాలెం పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.రెడ్డికంచరపాలెంలో అమ్మవారి ఘటాలను ఊరేగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అలాగే పశ్చిమ గోదావరి జిల్లా ఉండి నియోజక వర్గం ఉమ్మడి అభ్యర్థి రఘురామ కృష్ణరాజు, విశాఖ ఉత్తర కూటమి అభ్యర్థి విష్ణుకుమార్‌రాజు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరామా సేవా సంఘం పెద్దలతోపాటు 54వార్డు టీడీపీ అధ్యక్షుడు కుట్టా కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.


అమ్మవారిని దర్శించుకుంటున్న రఘురామకృష్ణరాజు, విష్ణుకుమార్ రాజు

తెలుగుజాతి పౌరుషానికి ప్రతీక ఆర్‌ఆర్‌ఆర్

డాబాగార్డెన్స్: తెలుగుజాతి పౌరుషానికి ప్రతీకగా కె.రఘురామకృష్ణరాజు నిలిచారని తెలుగుశక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ అన్నారు. సోమవారం నగరానికి విచ్చేసిన ఆయనను రఘురామకృష్ణరాజును మర్యాదపూర్వకంగాకలిసి సత్కరించారు. ట్రిపుల్‌ఆర్‌గాప్రసిద్ధిచెందిన రామకృష్ణరాజుకు ఎంపీగా తాను ప్రాతినిధ్యం వహించిన సొంత వైసీపీ విధానాలు నచ్చక ఆ పాలనపై తనదైన శైలిలో విమర్శిస్తూ ముందుకెళ్లారన్నారు. ఈ కార్యక్రమంలో బోడేపూడి దొరబాబు, దువ్వి పరమేశ్వరరావు, పి.లక్ష్మణ్‌చౌదరి, వసంతరావు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి

మహరాణిపేట, మే 21: మాజీ ప్రధాని మంత్రి దివంగత రాజీవ్ గాంధీ వర్థంతిని ఘనంగా నిర్వహించారు. మం గళవారం బీచ్‌రోడ్డులోని రాజీవ్ స్మృతి భవన్ వద్ద ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, పీసీపీ ప్రతినిధి సయ్యద్ అబీదా, పాసర్ల ప్రసాద్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దేశానికి రాజీవ్ చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు విజయ్‌చంద్ర , పాసర్ల వసంత కళ్యాణి, గణేష్, గురునాధరావు, లీలా ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

మెరుగైన సమాచారం పంచుకోవడమే ఐఎంపీసీసీ లక్ష్యం

▸▸ ఏఐబీ ఏపీ రీజియన్ అదనపు డైరెక్టర్ జనరల్ రాజిందర్‌చౌదరి

డాబాగార్డెన్స్, మే 21: ఐఎంపీసీసీ సమావేశం ద్వారా వివిధ సంస్థలను సమన్వయం చేసుకుని మెరుగైన సమాచారాన్ని అందించనున్నట్టు పీఐబీ ఏపీ రీజియన్ అదనపు డైరెక్టర్ జనరల్ రాజిందర్‌చౌదరి పేర్కొన్నారు. సిరిపురం ఆలిండియా రేడియో స్టేషన్‌లో ఇంటర్‌మీడియా పబ్లిసిటీ కోఆర్డినేషన్ కమిటీ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈకార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర మీడియా యూనిట్లు, పీఎస్‌యూల ద్వారా ప్రతి సంస్థలో చేపడుతున్న వివిధ కార్యకలా పాలు హైలెట్ చేయడం ఐఎంపీసీసీ లక్ష్యమన్నారు. పీఆర్‌నెట్ వర్క్‌ను అభివృద్ధి చేసి, మీడియా ఏకీకరణ, ఇతర అంశాల్లో ఆశించిన పలితాలను కచ్చితంగా సాధిస్తుందన్నారు. ప్రభుత్వ విధానాలు, కార్యక్రమాలపై ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాకు సమాచారాన్ని అందజేయడంలో విజయవాడలోని పత్రికా సమాచార కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఏపీ రీజియన్ ప్రాంతీయ కార్యాలయం సాధించిన విజయాలను ఈసందర్భంగా ఆయన వివరించారు. పీఐబీ ప్రభుత్వానికి, మీడియాకు మధ్య వారధిగా పనిచేస్తుందన్నారు. ప్రభుత్వ శాఖలు, పీఎస్‌యూలు, మీడియా యూనిట్లలోని వాటాదారులం దరి మధ్య సమగ్ర కమ్యూనికేషన్ , మేనేజ్‌మెంట్ వ్యూహాన్ని రూపొందించడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు చర్యలను ప్రజలకు చేరవేయడమే ఆ సమావేశం ఉద్దేశమన్నారు. సెంట్రల్ మీడియా యూనిట్లు, ఆలిండియా రేడియో, దూరదర్శన్, డీపీఈఆర్, ఇండియా పోస్ట్, నెహ్రూ యువజకేంద్రం సంఘటన్, బీహెచ్‌ఈఎల్, ఎయిర్‌పోర్టు ఆథారిటీ అధిపతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాజిందర్‌చౌదరి

గుర్తు తెలియని యువకుడి ఆత్మహత్య

మర్రిపాలెం, మే 21: గుర్తు తెలియని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మర్రిపాలెం రైల్వేస్టేషన్ సమీ పంలో చేటు చేసుకుంది. ఎయిర్‌పోర్ట్ పోలీసులు తెలిపిన వివరాలివి. మర్రిపాలెం జంక్షన్ నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే మార్గంలో ఉన్న ఓ టిఫిన్ సెంటర్ రేకుల షెడ్డు పైపునకు గుర్తుతెలియని వ్యక్తి కేబుల్‌వైర్‌తో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని ఉండటాన్ని మంగళవారం తెల్లవారుజామున స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమందించారు. పోలీసులు వచ్చి మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఆచూకీ తెలిస్తే.. 0891 2520812, సీఐ 9440904350 సంప్రదించాలి. సీఐ చక్రధరరావు నేతృత్వంలో పోలీసులు కేసుదర్యాప్తు చేస్తున్నారు.


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

గాజువాక కోర్టు ఆవరణలో యువకుడి ఆత్మహత్యాయత్నం

గాజువాక, మే 21: దొంగతనం కేసులో అరెస్టు అయిన వ్యక్తిని పోలీసులు కోర్టుకు తీసుకువస్తుండగా న్యాయస్థానం ఆవరణలో ఆ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. మంగళపాలెం ప్రాంతానికి చెందిన డి.సాయి (21)ని ఓ దొంగతనం కేసులో దువ్వాడ క్రైమ్ పోలీసులు అరెస్టు చేసి మంగళవారం కోర్టుకు తీసుకు వచ్చారు. ఈ క్రమంలో సాయి బ్లేడ్‌తో ఆత్మహత్య చేసు కునేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. స్వల్పంగా గా యపడిన సాయిని చికిత్సకు పోలీసులు కేజీహెచ్‌కు తరలించారు.

అంగన్‌వాడీ యూనియన్ నేత తులసి మృతి

సీతంపేట/ అల్లిపురం, మే 21: అంగన్వాడీ యూనియన్ సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు కామ్రేడ్ తులసి సోమవారం రాత్రి గుండెపోటుతో ఆకస్మికంగా మృతిచెందారు.ఈమె మృతికి సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, సీపీఎం కార్యదర్శి ఎం. జగ్గునాయుడు, కార్పొరేటర్ డాక్టర్ బి.గంగరావు సంతాపాన్ని ప్రకటించారు. తులసి అంగ న్వాడీల సమస్యల పరిష్కారానికి ఎనలేని కృషి చేశారన్నారు. జనవరిలో ఉద్యోగులచేపట్టిన విజయవంతానికి విశేష కృషి చేశారన్నారు. అల్లిపురంలో జరిగిన తులసి భౌతికాయం అంతిమయాత్రలో పెద్ద సంఖ్యలో అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొని నివాళులర్పించారు.


తులసి (ఫైల్)

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సీతమ్మధార: నిర్వహణ పనులనిమిత్తం బుధవారం ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫ రా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ జోన్ 1 ఈఈ బి.సింహాచలం తెలిపారు.ఎంఆర్‌ఒ ఆఫీస్, పి అండ్ టీ కాలనీ పోస్ట్ ఆఫీస్, గాంధీ నగర్ సత్యం జంక్షన్, బాలాజీ డాల్ఫిన్ హైట్స్ అపార్ట్‌మెంట్‌తదితర ప్రాంతాల వినియోగదారులు సహకరించాలన్నారు.

ఓటర్లకు లంచం ఇచ్చే సంస్కృతిని అరికట్టాలి

▸▸ ఆదికవి నన్నయ వర్సిటీ మాజీ వీసీ ఆచార్య ముత్యాలనాయుడు

డాబాగార్డెన్స్, మే 21: ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన సార్వత్రిక ఎన్నికల ప్రక్రియను చూస్తే ప్రజాస్వామ్యయుత రాజకీయాలు కాకుండా.. ధనస్వామ్యమే రాజ్యమేలినట్టు కనిపించిందని ఆదికవి నన్నయ యూనివర్సిటీ మాజీ వీసీ ఆచార్య ముర్రుముత్యాలనాయుడు అన్నారు. పలు పార్టీలకు చెందిన నేతలు పట్టపగలే డబ్బుపంచుతూ ఓట్లు అడగడం దారుణమని అన్నారు. మంగళవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటర్లకు లంచాన్ని సులభతరం చేసే అన్ని అక్రమ లావాదేవీలను అరికట్టేలా సంస్కరణలు తేవాలన్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే ప్రధానమంత్రి నరేంద్రమోదీ, రాష్ట్రపతి, అన్ని రాజకీయ పార్టీల అధిష్టానాలకు లేఖలు రాసినట్టు చెప్పారు. ఓటు అన్నది రహస్యంగా ఉండాలని, అయితే ఇటీవల ఎన్నికల్లో ఒక్కో ఓటు కనీసం రూ.1500 పలకడం శోచనీయమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని పోలింగ్ దారుణాలు, ధన ప్రవాహంపై ఆంగ్ల పత్రికల్లో సైతం ప్రచురితం కావడం పాలకుల వైఖరి ఏమిటో స్పష్టమవుతోందన్నారు. ఎన్నికల్లో దాదాపుగా ఒక్కో నియోజకవర్గంలో అభ్యర్థి, ప్రత్యర్థి పార్టీలు రూ.50 కోట్లు ఖర్చు చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా రూ. 8250 కోట్లు వ్యయం చేసినట్టు అన్నారు. ఈ సొమ్మంతా ఎక్కడి నుంచి వచ్చిందని ఆయన ప్రశ్నించారు.


మాట్లాడుతున్న ముత్యాలనాయుడు

రీ షెడ్యూల్‌తో ఆలస్యంగా నడుస్తున్న రైళ్లు

ఐదున్నర గంటలు ఆలస్యంగా నాందేడు ఎక్స్‌ప్రెస్


విశాఖపట్నం, మే 21: రైళ్ల రీషెడ్యూల్‌తో విశాఖ- నాందేడు ఎక్స్‌ప్రెస్ (20811) ఐదున్నర గంటలు ఆలస్యంగా బయలుదేరింది. మంగళవారం రాత్రి 8.00 గంటలకు విశాఖలో బయలుదేరాల్సిన ఈ రైలు బుధవారం తెల్లవారుజాము 1.30 బయలుదేరే విధంగా రీ షెడ్యూల్ చేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ముందస్తు సమాచారమందుకున్న కొందరు ప్రయాణికులు అర్థరాత్రి సమయంలో స్టేషన్‌కు రాలేమని భావించి ప్రయాణాన్ని రద్దు చేసుకున్నారు. తప్పనిసరిగా వెళ్లాల్సిన వారు ముందుగా స్టేషన్‌కు చేరుకుని నిరీక్షించారు. కాగా, జత రేకలు అందుబాటులో లేక షాలిమార్-సికింద్రాబాద్ ప్రత్యేక రైలు (07226), ఎస్ఎంవీ బెంగళూరు-అగర్తాల హంసఫర్ ఎక్స్‌ప్రెస్ (12503), తంబరం-సంత్రాగచ్చి అయోధ్య ఎక్స్‌ప్రెస్ (22842) రైళ్లను మంగళవారం రీ షెడ్యూల్ చేసి నడిపించడంతో ప్రయాణికులకు అవస్థలు తప్పలేదు.

అటవీశాఖలో అమెజాన్ ఒప్పందం

విశాఖపట్నం, మే 21 (ఆంధ్రజ్యోతి): గిరిజన సమాజ అభివృద్ధి, సాంస్కృతిక పరిరక్షణ ద్వారా గిరిజన కళాకారులకు సాధికారత కల్పించే విషయంలో అమెజాన్‌తో అటవీశాఖ ఒప్పందం కుదుర్చుకుంది. అమెజాన్‌కు చెందిన ఈ- కామర్స్ వేదిక ద్వారా గిరిజనుల ఉత్పత్తులు, కంబాలకొండ అభయార్యంలో నివసిస్తున్న శంభువానిపాలెం గిరిజన వర్గాల గొప్ప వారసత్వం ప్రపంచానికి పరిచయంచేసే వీలు కలుగుతుందని అటవీశాఖ భావించింది. ఈ మేరకు విశాఖ డివిజనల్ అటవీ అధికారి అనంతశంకర్, అమెజాన్ ఇండియా సెల్లర్ అక్విజేషన్ అండ్ డెవలప్‌మెంట్ విభాగాధిపతి గౌరవ భట్నాగర్ ఒప్పందంపై సంతకాలు చేశారు.

జగదాంబ వద్ద ఫుట్‌పాత్‌పై ఆక్రమణల తొలగింపు

జగదాంబ కూడలి, మే 21: జగదాంబ కూడలి వాచ్‌హౌస్, దసపల్లా హోటల్ తదితర మెయిన్ రోడ్డు ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు పోలీసులు తొలగించారు. మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో వ్యాపారులు దుకాణాలు ఏర్పాటుకు సిద్ధమవుతుండగా, టుటౌన్ ట్రాఫిక్ సీఐ రేవతమ్మ ఆధ్వ ర్యంలో పోలీసులు వచ్చి ఫుట్‌పాత్‌లపైన వ్యాపారాలను తొలగించాలని ఆదేశించారు. ఫుట్‌పాత్ వ్యాపారాలపై బతుకుతున్నామని, వాటిని తొలగిస్తే ఎలా అంటూ వ్యాపారులు తమ మొరపెట్టుకున్నారు. ట్రాఫిక్ పోలీసులు తమకు జీవీఎంసీ కమిషనర్ నుంచి ఆదేశాలు రావడంతో తాము ఖాళీ చేస్తున్నట్టు వివరించారు. ఏమైనా సమస్యలుఉంటే.. కమిషనర్‌తో మాట్లాడాలని ట్రాఫిక్ సీఐ రేవతమ్మ స్పష్టంచేశారు. అనంతరం దసపల్లా రోడ్డుపైన వ్యాపారుల సామగ్రిని జీవీఎంసీ వ్యానుల్లో ఎక్కించి తరలించారు. జోనల్ కార్యాలయంలో అధికారులను కలిసి ఈ సామ గ్రి తీసుకువెళ్లాలంటే పోలీసులు సూచించారు. జగదాంబ జంక్షన్ నుండి టర్నర్ చౌల్ట్రీ వరకు ఉన్న ఫుట్‌పాత్ వ్యాపారాలను పోలీసులు, జీవీఎంసీ సిబ్బంది తొలగించారు. ఇటీవల రోడ్డు విస్తరణలో భాగంగా మెయిన్‌రోడ్డు ఫుట్‌పాత్‌లను జీవీఎం సీ ఆధునికీకరించింది. ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తుండడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. రెండు రోజులుగా జీవీఎంసీ కమిషనర్ శ్రీకాంత్ వర్మ జగదాంబ వద్ద క్లాక్ టవర్ మెయిన్ రోడ్డు పనులు పరిశీలిస్తున్నారు. దీంతో ఫుట్‌పాత్‌ల ఆ క్రమణలతో తలెత్తుతున్న ఇబ్బందులు గుర్తించారు.లేపాక్షి వద్ద ఆక్రమణలు తొలగించాలని కొంత మంది జీవీఎంసీ అధికారు లు, పోలీసుల దృష్టి తెచ్చారు. ఈనేపథ్యంలో చర్యలు తీసుకున్నారు.


వ్యాపారుల దుకాణాలను తొలగిస్తున్న పోలీసులు

మహిళా ఓటర్లపైనే వైసీపీ ఆశలు

... 5వ పేజీ తరువాయి

సీట్లు రావడం ఖాయమని చెప్పడానికి కారణం ఏమై ఉంటుందనే దానిపై రకరకాల విశ్లేషణలు సాగుతున్నాయి. మహిళా ఓటర్లు తమ వైపు మొగ్గు చూపారనే ధీమానే అందుకు కారణమని ఆ పార్టీ అభ్యర్థులతోపాటు నేతలు పేర్కొంటున్నారు. ఉద్యోగులు, యువతలో తమకు కొంత వ్యతిరేకత ఉన్నప్పటికీ, నిరుపేదలు, దిగువ మధ్య తరగతికి సంక్షేమ పథకాలు అందడంతో వారంతా తమ పార్టీ అభ్యర్థులకు ఓటేశారనే అభిప్రాయంలో వైసీపీ నేతలు ఉన్నారు. ఇక మహిళలకు తమ ప్రభుత్వంలో ఎంతో మేలు జరిగిందని, పైగా వారి ఓట్లు లక్ష్యంగా తమ అభ్యర్థులు పోల్ మేనేజ్‌మెంట్ చేయడం కలిసొస్తుందని విశ్లేషిస్తున్నారు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటే స్వల్ప మెజారిటీలతోనైనా తమ అభ్యర్థులు బయటపడతారనే ఆశాభావంతో వైసీపీ నాయకులు ఉన్నారు.

వైసీపీ నేతల్లో లోలోన ఆందోళన

విజయంపై వైసీపీ నేతలు బయటకు విశ్వాసం వ్యక్తం చేస్తున్నప్పటికీ లోలోపల మాత్రం ఆందోళన చెందుతున్నారు. మహిళలంతా తమకే ఓటేస్తారని లెక్కించుకోవడం సరికాదని, మహా అయితే ఐదు శాతానికి మించి వ్యత్యాసం ఉండే అవకాశం కనిపించడం లేదని అభిప్రాయపడుతున్నారు. విశాఖ జిల్లాలో 20,12,373 మంది ఓటర్లు ఉండగా వీరిలో 14,09,118 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో 6,85,877 మంది పురుషులు కాగా మహిళలు 7,23,197, ఇతరులు 44 మంది ఉన్నారు. నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే భీమిలి నియోజకవర్గంలో 2,75,747 ఓట్లు పోలవ్వగా అందులో 1,40,446 ఓట్లు మహిళలవే. అలాగే విశాఖ తూర్పు నియోజకవర్గం పరిధిలో 2,00,563 ఓట్లు పోలవ్వగా 1,04,324 ఓట్లు, దక్షిణ నియోజకవర్గ పరిధిలో 1,37,474 ఓట్లు పోలవగా 71,209 ఓట్లు, విశాఖ ఉత్తర నియోజకవర్గంలో 1,84,703 ఓట్లు పోలవ్వగా 94,566 ఓట్లు, పశ్చిమ నియోజకవర్గ పరిధిలో 1,48,942 ఓట్లు పోలైతే వాటిలో 77,781 ఓట్లు, గాజువాక పరిధిలో పోలైన 2,32,949 ఓట్లలో 1,18,105 మహిళలవి. ఇక పెందుర్తి నియోజకవర్గంలో పరిశీలిస్తే 2,28,740 ఓట్లు పోలైతే వాటిలో 1,16,766 ఓట్లు మహిళలవే కావడం విశేషం. ప్రతి నియోజకవర్గంలోనూ పోలైన ఓట్లలో సగానికిపైగా ఓట్లు మహిళలే కాబట్టి, వారిలో 50 శాతానికిపైగా తమకే ఓటు వేస్తారని వైసీపీ నేతలు భావిస్తున్నారు. అందులో ఏమాత్రం తేడా జరిగినా తమకు ఘోరపరాజయం తప్పదని అంగీకరిస్తుండడం విశేషం. వైసీపీ నేతల లెక్కలను కూటమి నేతలు కొట్టిపారేస్తున్నారు. ఈ వర్గం, ఆ వర్గం అనే తేడా లేకుండా అన్ని వర్గాలు కూటమి అభ్యర్థులకు మద్దతు తెలిపాయని, జిల్లాలో ఏడుకు ఏడు సీట్లు గెలుచుకుంటామని ధీమాగా చెబుతున్నారు.

ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు

... 5వ పేజీ తరువాయి

పార్లమెంటు నియోజకవర్గ పోస్టల్ బ్యాలెట్లు ఈఈఈ విభాగం సెమినార్ హాలులో నిర్వహించనున్నారు. భీమిలి నియోజకవర్గ అసెంబ్లీ ఓట్ల లెక్కింపు న్యూక్లాస్ రూమ్ కాంప్లెక్స్‌లోని గ్రౌండ్ ఫ్లోర్‌లో రూమ్ నంబరు-5, పార్లమెంటు ఈవీఎంలు రూమ్ నంబరు-7, విశాఖ తూర్పు అసెంబ్లీ ఓట్లు రూమ్ నంబరు-8, పార్లమెంటు ఓట్లు మొదటి అంతస్థు రూమ్ నంబరు-10లో చేపడతారు. విశాఖ దక్షిణ నియోజకవర్గ అసెంబ్లీ, పార్లమెంటు ఓట్లు కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగం మొదటి అంతస్థులో చేపడతారు. న్యూక్లాస్‌రూమ్ మొదటి అంతస్థు రూమ్-1లో విశాఖ ఉత్తర నియోజకవర్గ అసెంబ్లీ సెగ్మెంట్, రూమ్ నంబరు-5లో పార్లమెంటు నియోజకవర్గ ఓట్లు లెక్కిస్తారు. ఇనుస్ట్రుమెంటేషన్ విభాగంలో సెమినార్ హాలులో విశాఖ పశ్చిమ అసెంబ్లీ, క్లాస్‌రూమ్-3లో పార్లమెంటు ఓట్లు, కెమికల్ ఇంజనీరింగ్ విభాగం కింద అంతస్థులోని డ్రాయింగ్‌రూమ్‌లో గాజువాక అసెంబ్లీ, మొదటి అంతస్థులోని సెమినార్ హాలులో పార్లమెంటు, ఇంజనీరింగ్ కళాశాల మెయిన్‌బ్లాక్‌లో రూమ్ నంబరు 205లో పెందుర్తి అసెంబ్లీ, మొదటి అంతస్థులో రూమ్ నంబరు 202లో పార్లమెంటు నియోజకవర్గ ఓట్లు లెక్కింపు చేపడతారు.

స్ట్రాంగ్ రూమ్‌ల తనిఖీ

ఏయూ ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో బ్యాలెట్లు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్‌లను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టరు ఎ.మల్లికార్జున మంగళవారం తనిఖీ చేశారు. జాయింట్ సీపీ ఫకీరప్పతో కలిసి ఆయన పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన స్ట్రాంగ్‌రూమ్‌లు తనిఖీ చేశారు. సీసీ కెమెరాల పనితీరు ద్వారా రికార్డయ్యే మానటరింగ్ రూమ్‌ను తనిఖీ చేశారు. భద్రతా సిబ్బంది, అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచన చేశారు. కలెక్టర్ వెంట స్వతంత్ర అభ్యర్థులు, ఆర్వోలు ఉన్నారు.

పర్యాటకంపై నిర్లక్ష్యం

... 5వ పేజీ తరువాయి

పర్యాటక గెస్ట్‌హౌస్‌లను రాజధాని అవసరాల పేరుతో తీసేసుకొని.. విశాఖపట్నం వచ్చేవారికి ఎటువంటి వసతి లేకుండా చేశారు. దాంతో అధిక మొత్తాలు వెచ్చింది ప్రైవేటు హోటళ్లను ఆశ్రయించాల్సి వస్తోంది.

విశాఖపట్నాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని చెబుతున్న నాయకులు ఈ ఐదేళ్లలో ఏమీ చేయలేకపోయారు. ఉన్న ఆస్తులను కొల్లగొట్టారు. ఖరీదైన భూములను రిసార్ట్స్ నిర్మాణం పేరుతో పెద్ద సంస్థలకు కట్టబెట్టారు. అవి కూడా సామాన్య పర్యాటకులకు అందుబాటులో ఉండే విధంగా కాకుండా విమానాల్లో వచ్చేవారికి రోజుకు రూ.పది వేలకు పైగా అద్దె చెల్లించే స్థోమత ఉన్నవారి కోసం నిర్మిస్తున్నారు.

పర్యాటకులకు ఇస్తే తప్పేముంది?

- మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు

రుషికొండలో ఆధునిక వసతులతో పర్యాటకుల కోసం భవన సముదాయాలు నిర్మించారు. ప్రారంభోత్సవం కూడా చేశారు. ప్రస్తుతం అవి ఖాళీగానే ఉన్నాయి. సీఎం నిర్ణయం కోసం వాటిని పక్కనపెట్టడం సరికాదు. విశాఖలో పర్యాటకులకు ప్రభుత్వ వసతి లేనందున తక్షణమే వాటి వివరాలు వెబ్‌సైట్‌లో పెట్టి, పర్యాటకులకు కేటాయించాలి. ఆ విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి. ప్రజాధనం వృథా కాకుండా చూడాలి.

పెందుర్తి ప్రాంతంలో తెలంగాణ ఏసీబీ తనిఖీలు

... 5వ పేజీ తరువాయి

కుమారుడు జోగినాయుడు పోలీస్ స్పెషల్ పార్టీలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. ప్రస్తుతం విశాఖ సింహాచలం దేవస్థానం సెక్యూరిటీ విభాగంలో విధులు నిర్వహిస్తున్నాడు. జోగినాయుడుకు, డీఎస్పీ ఉమామహేశ్వరరావు బంధువులకు సంబంధాలు ఉండడంతో ఏసీబీ సోదాలు చేసినట్టు సమాచారం. సోదాల వివరాలు వెల్లడించడానికి ఏసీబీ అధికారులు నిరాకరించారు.



పరివారంతో ఆలయంలో దాసుడు

సింహాద్రి అప్పన్నను దర్శించుకున్న ఒడిశా దాసుడు

సింహాచలం, మే 21: వరాహలక్ష్మీనృసింహస్వామిని ఒడిశాకు చెందిన లక్ష్మీకాంత్ నాయకోదాసుడు మంగళవారం ఉదయం కుటుంబసభ్యులు, శిష్యపరివారంతో దర్శించుకున్నారు. ఆలయ కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని, బేడామండప ప్రదక్షిణలు చేసిన తరువాత అంతరాలయంలో పూజలు జరిపించారు. స్వామికి ప్రీతికరమైన సుగంధ పరిమళభరిత సంపెంగలు, మల్లెలు, విరజాజులతోపాటు, మామిడి అరటి పండ్లను సమర్పించారు. అనంతరం గోదాదేవి అమ్మవారిని దర్శించుకున్నారు.

స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (ఆపరేషన్స్)గా సలీమ్ జి పురుషోత్తమన్

ఉక్కుటౌన్‌షిప్, మే 21: స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (ఆపరేషన్స్)గా సలీమ్ జి పురుషోత్తమన్‌ను పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ సెలక్షన్ బోర్డు (పీఈఎస్‌బీ) ఎంపిక చేసింది. ఈ పోస్టు ఖాళీగా ఉండడంతో మంగళవారం ఢిల్లీలో జరిగిన ఇంటర్వ్యూకు స్టీల్‌ప్లాంట్ నుంచి ఆరుగురు, సెయిల్ నుంచి ఇద్దరు. బ్రైత్‌వైట్, ఎన్టీపీసీ, సెంట్రల్ కోల్ ఫీల్డ్స్ ఇండియన్ ఆర్డీనెన్స్ ఫ్యాక్టరీ సర్వీస్ నుంచి ఒకరు చొప్పున మొత్తం 12 మంది హాజరయ్యారు. వీరిలో బ్రైత్ వైట్ అండ్ కో లిమిటెడ్ సంస్థలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న సలీమ్ జి పురుషోత్తమన్ ఎంపికైనట్లు పీఈఎస్‌బీ పేర్కొంది.

నేడు జీవవైవిధ్య సదస్సు

విశాఖపట్నం, మే 21 (ఆంధ్రజ్యోతి): జీవవైవిధ్య దినోత్సవం పురస్కరించుకుని బుధవారం ఉదయం ఆంధ్రవిశ్వవిద్యాలయం కన్వెన్షన్ హాల్లో జాతీయస్థాయి సదస్సు నిర్వహించనున్నారు. జీవ వైవిధ్యమండలి ఆధ్వర్యంలో జరిగే సదస్సుకు అటవీశాఖ ప్రిన్సిపల్ సీసీఎఫ్ చిరంజీవి చౌదరి ముఖ్య అతిథిగా హాజరవుతారని అధికారులు తెలిపారు.

రైల్వే వ్యాగన్ వర్క్‌షాప్ వద్ద ధర్నా



నినాదాలు చేస్తున్న కార్మికులు

ఆటోనగర్, మే 21: కార్మికులకు, రైల్వే వ్యాగన్ యాజమాన్యానికి మధ్య జరిగిన ఒప్పందాలను అమలు చేయాలని కోరుతూ మంగళవారం ఈస్ట్‌కోస్ట్ రైల్వే కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు ఎం.రాంబాబు మాట్లాడుతూ ఒప్పందం జరిగి నాలుగు నెలలు గడిచినా యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ కార్మికులకు అన్యాయం చేస్తుందని మండిపడ్డారు. ఒప్పందాన్ని తక్షణమే అమలు చేయకపోతే నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైల్వే వ్యాగన్ వర్క్‌షాప్ నాయకులు కె.అవతారం, వెంకటేశ్వరరావు, సురేశ్, రాజు, సతీశ్, రమేశ్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సింహాచలంలో నేడు నృసింహ జయంతి

సింహాచలం, మే 21: నృసింహస్వామి ఆవిర్భావ నక్షత్ర స్వాతిని పురస్కరించుకుని ఈనెల 22న నృసింహ వనంలోని స్వామివారి విగ్రహం వద్ద సాయంత్రం నాలుగు గంటలకు 'నృసింహ జయంతి'ని నిర్వహించనున్నారు. ఉత్తర రాజగోపురానికి ఎదురుగా ఉన్న మైదానంలో ఉదయం 8 గంటల నుంచి పూజలు ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలను పురస్కరించుకుని 22న సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే భక్తులకు స్వామి వారి సర్వదర్శనాలు లభిస్తాయన్నారు. స్వాతి హోమంలో పాల్గొనదలచిన భక్తులు పీఆర్వో కార్యాలయంలో ప్రత్యక్షంగా లేదా ఆన్‌లైన్‌లో టికెట్లను పొందవచ్చునన్నారు.

సినిమా గైడ్

- **బాక్ :** జగదాంబ, శ్రీరామ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీ (గాజువాక)
- **ఆ ఒక్కటి అడక్కు :** మెలోడీ, సంగం, కిన్నెర, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), లిఖిత(శ్రీహరిపురం), శ్రీకన్య-2 (గాజువాక), శ్రీకన్య సినీపోలిస్ , దుర్గ, (మధురవాడ).
- **ప్రసన్నవదనం :** శరత్, వెంకటేశ్వర-1, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం),
- **శబరి :** వెంకటేశ్వర.
- **రత్నం :** అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్ (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), రాములమ్మ (తగరపువలస)
- **గీతాంజలి మళ్ళీ వచ్చింది :** రమాదేవి, మౌర్య (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **ది ఫ్యామిలీ స్టార్ :** కామేశ్వరి, శ్రీనరసింహ (గోపాలపట్నం)
- **టిల్లు స్క్వేర్ :** శారద, మోహిని (గాజువాక),
- **గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ :** శ్రీవెంకటేశ్వర

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 26, టమాటా 28, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 36, పచ్చిమిర్చి 54, కాకరకాయలు 36, బీరకాయలు 46, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 32, క్యాబేజీ 22, క్యారెట్ 34, దొండకాయలు 32, బంగాళదుంపలు 27, అరటికాయ (పెద్దది)6, అల్లం (పాతది) 170, మునక్కాడలు (కిలో) 34, బరబాటి 50, ముల్లంగి 42, నిమ్మకాయలు (కిలో) 80, గోరుచిక్కుడు 36, దోసకాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 190, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 70, పొటల్స్ 40, కీరదోస 26, కాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 30, చిలగడదుంపలు 42, కంద 64, దేముడు చిక్కుడు 52, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 40.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	138
ఫారం ధర	--	158
విత్ స్కిన్	--	286
స్కిన్‌లెస్	--	296

ఉద్యోగుల సహనాన్ని పరీక్షిస్తే ఉపేక్షించం

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు

నేడు డెడికేషన్ పార్కు వద్ద అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన

కూర్మన్నపాలెం, మే 21: ఉద్యోగుల సహనాన్ని పరీక్షిస్తే ఉపేక్షించబోమని స్టీల్‌ప్లాంట్ యాజమాన్యానికి ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 1,195వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా కమిటీ నాయకుడు వరసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ కుట్రలో భాగంగానే ఉద్యోగులకు జీతాలు ఇవ్వకుండా ఉక్కు యాజమాన్యం ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. కార్మికులకు జీతాలు చెల్లించే విషయంలో ఉక్కు యాజమాన్యం సహకరించడం లేదని, భవిష్యత్తులో ఉక్కు కార్మికుల ఆగ్రహం వల్ల వాటిల్లే పరిణామాలకు ఉన్నతాధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఇందులో భాగంగా



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

బుధవారం ఉదయం పది గంటలకు ఉక్కునగరంలోని డెడికేషన్ పార్కు వద్ద అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేపట్టే నిరసన కార్యక్రమంలో కార్మికులంతా అధిక సంఖ్యలో పాల్గొనవలసిందిగా విజ్ఞప్తి చేశారు. బీజేపీ పాలనలో సీఎండీ, డైరెక్టర్లుగా నియమితులైన బోర్డు అధికారుల తీరుపై కార్మికులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, వారి పనితీరు, అసమర్థత పలు అనుమానాలకు తావిస్తుందని పేర్కొన్నారు. ప్రతినెలా ఏదో తేదీలోగా కార్మికులకు జీతాలు ఇవ్వాలని చట్టం చెబుతున్నా ఉక్కు యాజమాన్యం పట్టించుకోకపోయినా కార్మిక సంఘాల నాయకులు కోర్టును ఎందుకు ఆశ్రయించలేదని ప్రశ్నించారు. ఉద్యోగుల జీతాల చెల్లింపు విషయంలో కార్మిక సంఘాల నాయకులు మౌనం దాల్చడం సమంజసం కాదన్నారు. నాయకుడు డీసీహెచ్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉక్కు కర్మాగారంపై మూడేళ్లుగా బీజేపీ పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులను పలు రకాలుగా ఇబ్బందులకు గురి చేయడం భావ్యం కాదన్నారు. స్టీల్‌ప్లాంట్ కోసం భూములిచ్చిన నిర్వాసితులకు ఇప్పటివరకు న్యాయం చేయకపోగా, ఉపాధి పొందిన వారికి జీతాలివ్వకుండా ఇక్కట్లకు గురి చేయడం శోచనీయమన్నారు. కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ ఉన్నతాధికారులు ఉక్కు ఉద్యోగులను ఎన్ని ఇబ్బందులకు గురి చేసినా మొక్కవోని దీక్షతో సంయమనం పాటిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు విళ్లా రామ్మోహన్ కుమార్, శ్రీను, మధు, రాజు, నరేంద్ర, సత్యనారాయణ, శ్రీనివాసనాయుడు, తదితరులు పాల్గొన్నారు.



కోకో ఓవెన్ విభాగం వద్ద ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు



ఈడీ (వర్క్స్) కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఇంటక్ నాయకులు

జీతాలు చెల్లించాలంటూ ఉక్కు కార్మిక సంఘాల ధర్నా

ఉక్కుటౌన్‌షిప్, మే 21: ఉక్కు ఉద్యోగులు, కార్మికులకు తక్షణమే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సీఐటీయూ, ఇంటక్ నాయకులు వేర్వేరుగా ప్లాంట్‌లో ధర్నా నిర్వహించారు. సీఐటీయూ నాయకులు ఆయా విభాగాధిపతుల కార్యాలయాల ముందు ధర్నా నిర్వహించి విభాగాధిపతులకు వినతిపత్రాలు అందజేశారు.

కోకో ఓవెన్ విభాగం వద్ద నిర్వహించిన ఆందోళనలో సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరాం మాట్లాడుతూ జీతాల చెల్లింపు పట్ల ఉక్కు యాజమాన్యం దుర్మార్గంగా వ్యవహరిస్తుందని, గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ నెల ఇప్పటికీ జీతాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. దీంతో కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉక్కు యాజమాన్యం జీతీల చెల్లింపు పట్ల స్పందించకపోతే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు యు.రామస్వామి, వైటీ దాసు, అప్పారావు, శ్రీనివాసరాజు, సన్యాసిరావు, సురేశ్‌బాబు, డీవీ రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటక్ ఆధ్వర్యంలో..

ఉక్కు యాజమాన్యం కార్మిక వర్గంపై కక్ష సాధింపులకు పాల్పడుతుందని ఇంటక్ యూనియన్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్, అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు మండిపడ్డారు. కార్మికులకు జీతాలు చెల్లించాలంటూ యూనియన్ ఆధ్వర్యంలో ఈడీ (వర్క్స్) కార్యాలయం వద్ద బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల ఇబ్బందులను యాజమాన్యం పట్టించుకోవడం లేదని, కావాలనే యాజమాన్యం ఉద్యోగులకు జీతాలు చెల్లించడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు కారు రమణ, సుబ్బయ్య, పీవీ రమణమూర్తి, నాయుడు, ప్రభాకరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పైడితల్లమ్మ పండుగ

గోపాలపట్నం, మే 21: ఇక్కడి ప్రశాంతినగర్‌లో కొలువుదీరిన పైడితల్లమ్మ పండుగను మంగళవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు ఉదయం నుంచే అమ్మవారిని దర్శించేందుకు ఆలయం వద్ద బారులుతీరారు. ఆలయ ధర్మకర్త పెతకంశెట్టి గణబాబు పైడితల్లమ్మనుఎ దర్శించుకుని పూజలు నిర్వహించారు అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తడంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. ఎండ తీవ్రతకు భక్తులు ఇబ్బందులు పడకుండా తగిన ఏర్పాట్లు చేశారు. సాయంత్రం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

అక్కిరెడ్డిపాలెంలో..

అక్కిరెడ్డిపాలెం: అక్కిరెడ్డిపాలెం పరిసర ప్రాంతాల ప్రజల ఆరాధ్య దేవత పైడిమాంబ అమ్మవారి పండుగను ఘనంగా నిర్వహించారు. నూతన వస్త్రాలు, ప్రత్యేక పుష్పాలు, ఆభరణాలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి వేకువ జామున పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. పలువురు మహిళలు లలితా సహస్రనామ పారాయణాన్ని పఠించడంతో పాటు కుంకుమ పూజలు జరిపారు. సాయంత్రం ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.





ప్రశాంతినగర్‌లో పూజలందుకున్న పైడితల్లమ్మ.. పక్కన అమ్మవారి దర్శనార్థం క్యూలో భక్తులు

బుచ్చిరాజుపాలెంలో దుర్గాలమ్మ పండుగ

ఎన్.ఎ.డి.జంక్షన్: జీవీఎంసీ 90వ వార్డు పరిధి బుచ్చిరాజుపాలెంలో దుర్గాలమ్మ, బంగారమ్మ గుడిలో పూజలందుకుంటున్న దుర్గాలమ్మ అమ్మవారి ప్రధాన పండుగను త్రివేణి గ్రామ అభ్యుదయ సేవా సంఘం, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వేకువజాము నాలుగు గంటల నుంచే అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు, అర్చనలు చేశారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు సమర్పించారు. మధ్యాహ్నం భక్తులకు అన్న సమారాధన చేపట్టారు. సాయంత్రం అమ్మవారి ఘటాలను బాణసంచా కాల్పులు, తప్పెటగుళ్లు, నేల వేషాలు, తదితర సాంస్కృతిక ప్రదర్శనల నడుమ ఊరేగించారు. అమ్మవారిని ఎమ్మెల్యే గణబాబు, కార్పొరేటర్ బొమ్మిడి రమణ దర్శించుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి



అమృత్ భరత్‌రాజ్ మృతదేహం

పెందుర్తి, మే 21: ఇంజనీర్ కావాలన్న కల సాకారం కాకుండానే ఓ విద్యార్థి రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. చీమలాల్లిలో జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించి సీఐ ఎల్. రామకృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పినగాడికి చెందిన రవిరాజ్ అనే వ్యక్తి గ్యాస్ కంపెనీలో పని చేస్తున్నాడు. ఆయన కుమారుడు అమృత్ భరత్‌రాజ్ (18) ఇటీ వలే ఇంటర్ పూర్తి చేసి ఇంజనీరింగ్‌లో ప్రవేశం కోసం సిద్ధమవుతు న్నాడు. ఈ క్రమంలో మంగళవారం ద్విచక్ర వాహనంపై తమ ఇంటి నుంచి పినగాడి మీదుగా వేపగుంట బయలుదేరాడు. మార్గమధ్యంలో చీమలాపల్లి రోడ్డుపై గల పెద్ద గోతిలో బైక్ పడడంతో కుదుపునకు అదుపు తప్పి కింద పడిపోవ డంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు సహకారంతో భరత్‌రాజ్‌ను 108 అంబులెన్స్‌లో కేజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తగరపువలస సర్వీస్ రోడ్డులో రిటైర్డ్ హెచ్‌సీ దుర్మరణం

తగరపువలస, మే 21: రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ హెడ్‌కానిస్టేబుల్ దుర్మరణం చెందారు. ఈ సంఘటన తగరపువలస జాతీయ రహదారి సర్వీసు రోడ్డులో వలందపేట వద్ద మంగళవారం ఉదయం జరిగింది. ఎస్ఐ కె.హరీశ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దండు వెంకటపతిరాజు (64) 2018లో హెడ్ కానిస్టేబుల్‌గా పదవీ విరమణ చేశారు. కుమారుడు మనోజ్‌కుమార్ లండన్‌లో చదువుకుంటున్నాడు. వీరి కుటుంబం తాళ్లవలసలోని రాజేశ్ రెసిడెన్సీలో నివాసముంటోంది. గ్రామ దేవత పండుగ నేపథ్యంలో పూజా సామగ్రి కొనుగోలు చేసేందుకు మంగళవారం ఉదయం సంగివలస మూడు గుళ్ల అమ్మవార్ల సెంటర్‌కు వెంకటపతిరాజు స్కూటీపై వెళ్లారు. తిరిగి ఇంటికి వెళ్తుండగా ఆయన ద్విచక్రవాహనాన్ని వలందపేట వద్ద ఎదురుగా విశాఖ నుంచి వస్తున్న కారు బలంగా ఢీకొని కొంతదూరం ఈడ్చుకు పోయింది. ఈ ప్రమాదంలో తలకు తీవ్రమైన గాయమైన వెంకటపతిరాజు అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం తెలుసుకుని కుటుంబ సభ్యులు ప్రమాద స్థలానికి చేరుకున్నారు. కారు డ్రైవర్ అనకాపల్లి జిల్లా చోడవరానికి చెందిన వర్రి నందకృష్ణను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుని కుమార్తె రుద్రరాజు సాయిలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ హరీశ్ తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

గోపాలపట్నం, మే 21: గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను గోపాలపట్నం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కేరళ రాష్ట్రానికి చెందిన షాజీ, థామస్ అనే యువకులు ఉమ్మడి విశాఖలోని ఏజెన్సీ నుంచి బస్సులో గంజాయిని గోపాలపట్నం తీసుకువచ్చారు. ఇక్కడ నుంచి రైలు మార్గంలో కేరళ వెళ్లేందుకు సింహాచలం రైల్వే స్టేషన్ కూడలికి సోమవారం రాత్రి చేరుకున్నారు. స్టేషన్ పరిసరాల్లో అనుమానాస్పదంగా సంచరిస్తున్న వీరిని పోలీసులు విచారించడంతో గంజాయి రవాణా చేస్తున్నట్టు గుర్తించారు. వీరి బ్యాగ్‌లో ఉన్న సుమారు 11 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేసి మంగళవారం ఉదయం రిమాండ్‌కు తరలించారు. సీఐ సురేశ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐద్వా నాయకురాలు మృతికి సంతాపం

అక్కిరెడ్డిపాలెం, మే 21: అంగన్‌వాడీ వర్కర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు, ఐద్వా రాష్ట్ర నాయకురాలు తులసి మంగళవారం మృతి చెందడం పట్ల బెల్ హెచ్‌పీవీపీ సీఐటీయూ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. బెల్ టౌన్‌షిప్‌లో జరిగిన సంతాప కార్యక్రమంలో నాయకులు జీటీపీ ప్రకాశ్, జగన్నాథరావు, నారపరెడ్డి, అచ్చెంనాయుడు, జి.రాంబాబు, కె.పవన్‌కుమార్, తదితరులు తులసి సేవలను కొనియాడారు.

ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్ లైవ్ లింక్ ఇవ్వాలి


ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు కేఏ పాల్ డిమాండ్

విశాఖపట్నం, మే 21 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల(ఈవీఎం)ను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ భద్రతపై తమకు అనుమానాలు ఉన్నందున, వాటికి పోలీసులు ఏర్పాటుచేసిన సీసీ టీవీ కెమెరాల లైవ్ లింక్‌ను ఇవ్వాలని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు కేఏ పాల్ డిమాండ్ చేశారు. విశాఖపట్నం పార్లమెంటు స్థానానికి పోటీ చేసిన స్వతంత్ర అభ్యర్థులతో కలిసి ఆశీల్‌మెట్ట కన్వెన్షన్ సెంటర్‌లో ఆయన మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, లైవ్ లింక్‌తో పాటు సీసీ టీవీ ఫుటేజ్ కూడా ఇవ్వాలన్నారు. గతంలో ఇలా ఇచ్చేవారని, ఇప్పుడు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఓట్ల లెక్కింపు రోజున అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని పోలీసు శాఖను కోరారు. విశాఖపట్నం పార్లమెంటుకు తాను పోటీ చేశానని, తప్పకుండా గెలుస్తానని విశ్వాసం వ్యక్తంచేశారు.

26న 'గీతం' ఎంట్రన్స్ టెస్ట్

సాగర్‌నగర్, మే 21: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్ ద్వారా నిర్వహిస్తున్న డిగ్రీ, పీజీ కోర్సులలో ప్రవేశానికి ఈనెల 26న గీతం అడ్మిషన్ టెస్ట్ (గ్యాట్) నిర్వహిస్తున్నట్టు స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వేదవతి తెలిపారు. బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, ఎలక్ట్రానిక్స్, మైక్రోబయాలజీ, ఫిజిక్స్, మేథ్స్, స్టాటిస్టిక్స్, ఫుడ్‌సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్‌లో నాలుగేళ్ల బీఎస్సీ (ఆనర్స్) కోర్సులు, మూడేళ్ల బీసీఏ కోర్సు నిర్వహిస్తున్నామన్నారు. అప్లైడ్ మేథ్స్, బయోకెమిస్ట్రీ అండ్ మాలిక్యులర్ బయాలజీ, డేటా సైన్స్, బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, ఎలక్ట్రానిక్స్, మైక్రోబయాలజీ, ఫిజిక్స్, స్టాటిస్టిక్స్, ఫుడ్‌సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్‌లో రెండేళ్ల ఎమ్మెస్సీ కోర్సులుంటాయని పేర్కొన్నారు. వీటితో పాటు మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ (ఎంసీఏ) కోర్సు, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా బీఎస్సీ, ఎమ్మెస్సీ కోర్సులను నిర్వహిస్తున్నామన్నారు. వీటిలో ప్రవేశానికి ఈనెల 24లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోదలచిన వారు గీతం వెబ్‌సైట్‌ను పరిశీలించవచ్చునన్నారు.

అంతర్జాతీయ మోడలింగ్ పోటీలకు కార్తికేయరెడ్డి ఎంపిక



అక్కిరెడ్డిపాలెం, మే 21: కేరళ రాష్ట్రంలోని కాలికట్‌లో ఇటీవల జరిగిన జాతీయ జూనియర్ మోడల్ ఇంటర్నేషనల్ సీజన్-8 పోటీల్లో షీలానగర్‌కు చెందిన బీజే కార్తికేయరెడ్డి విజేతగా నిలిచాడు. ఆంధ్ర ఫ్యాషన్ వీక్‌లో విజేతగా నిలిచిన కార్తికేయరెడ్డి కాలికట్‌లో జరిగిన పోటీల్లో ప్రిన్స్ అండర్-8 విభాగంలో పాల్గొని ఇంటర్వ్యూతో పాటు ఇతర విభాగాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ట్రోఫీని కైవసం చేసుకున్నాడు. ఈ పోటీల్లో విజేతగా నిలవడంతో కార్తికేయరెడ్డి ఆగస్టులో థాయిలాండ్‌లో జరగనున్న అంతర్జాతీయ జూనియర్ మోడలింగ్ పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించాడు. నాలుగో తరగతి చదువుతున్న కార్తికేయరెడ్డి తల్లి పావని లత భెల్ హెచ్‌పీవీపీలో ఇంజనీర్‌గా, తండ్రి శ్రీనివాసరెడ్డి ఈఐఎల్‌లో ఏజీఎంగా విధులు నిర్వర్తిస్తున్నారు. జాతీయ పోటీల్లో విజేతగా నిలిచిన కార్తికేయరెడ్డిని పలువురు అభినందించారు.

విద్యుదాఘాతంతో యువకుడికి గాయాలు

మల్కాపురం, మే 21: జవహర్‌నగర్‌లోని ఓ యువకుడు మంగళవారం విద్యుదాఘాతానికి గురయ్యాడు. స్థానికంగా నివాసం ఉంటున్న యువకుడు వినోద్ అనే యువకుడు నడిచి వెళుతు మార్గమధ్యంలోని విద్యుత్ స్తంభాన్ని తాకాడు. దీంతో ఒక్కసారికి విద్యుత్ షాక్‌కు గురై పక్కనే ఉన్న కాలువలో పడి గాయపడ్డాడు. బాధితున్ని స్థానికులు ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన స్తంభానికి విద్యుత్ సరఫరా కాకుండా అధికారులు చూడాలని స్థానికులు కోరుతున్నారు.



వైద్య నిపుణులతో మాట్లాడుతున్న డాక్టర్ వెంకటేశ్వర్

గ్రామ స్థాయిలో కేన్సర్ స్క్రీనింగ్‌కు కార్యాచరణ

ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్

అగనంపూడి, మే 21: గ్రామ స్థాయిలో కేన్సర్ స్క్రీనింగ్‌కు కార్యాచరణ ప్రణాళికను వైద్య ఆరోగ్యశాఖ సిద్ధం చేస్తుందని, ఇందులో భాగంగా రాష్ట్ర స్థాయిలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పేర్కొన్నారు. ఇక్కడి హోమీబాబా కేన్సర్ ఆస్పత్రి, పరిశోధన కేంద్రంలో నేషనల్ హెల్త్ మిషన్ ఆధ్వర్యంలో ప్రివెంటివ్ అంకాలజీ, కమ్యూనిటీ హెల్త్ మెడిసిన్, గైనకాలజీ, ఈఎన్‌టీ, డెంటిస్ట్రీ, పేథాలజీ, సర్జరీ విభాగాల్లోని వైద్య నిపుణులతో మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో శిక్షణ ఇచ్చేందుకు మంచి మానవ వనరులు ఉన్నాయన్నారు. శిక్షణ పొందిన వైద్య నిపుణులు జిల్లా స్థాయిలో శిక్షణ ఇవ్వడంతో పాటు ఏఎన్‌ఎంలు, సీహెచ్‌వోలకు శిక్షణ అందించాలని సూచించారు. స్క్రీనింగ్‌లు నిర్వహించి సంబంధిత మెడికల్ ఆఫీసర్‌లకు రిఫర్ చేయాలన్నారు. గ్రామ స్థాయిలో కేన్సర్ స్క్రీనింగ్ విజయవంతం చేసేందుకు వైద్య నిపుణులు కృషి చేయడంతో పాటు అందుకు తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని డాక్టర్ వెంకటేశ్వర్ కోరారు. అనంతరం ఆయన వైద్య నిపుణులతో కలిసి ఆస్పత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించారు. ఆయన వెంట రాష్ట్ర నోడల్ అధికారులు శ్యామల, రాజ్‌కిరణ్, ఆస్పత్రి డైరెక్టర్ ఉమేశ్‌మహంతి శెట్టి, డాక్టర్ రవితేజ, తదితరులు ఉన్నారు.

స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ లైజన్ అధికారికి సత్కారం



రాధికను సత్కరిస్తున్న ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ప్రతినిధులు

ఉక్కుటౌన్‌షిప్, మే 21: స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ లైజన్ అధికారిగా నియమితులైన రాధికను ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ప్రతినిధులు మంగళవారం కలిసి అభినందనలు తెలిపి సత్కరించారు. ప్లాంట్‌లో సుదీర్ఘ కాలం పాటు విధులు నిర్వహించిన రాధిక ప్రస్తుతం రెండు కీలక బాధ్యతలను స్వీకరించడం ఎంతో ఆనందంగా ఉందని వారు పేర్కొన్నారు. కార్మికుల సమస్యలపై అవగాహన కలిగిన వ్యక్తికి బాధ్యతలు అప్పగించడం శుభ పరిణామమని అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొండా తౌడన్న, బయ్యే మల్లయ్య పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు ఎస్.సత్యనారాయణ, కేవీ రత్నం, మోహన్ బాబు, వేణుగోపాల్, పణీంద్రబాబు, గణేశ్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో వక్తృత్వ పోటీలు

పెదగంట్యాడ, మే 21: పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా నిర్వహించిన ఈ పోటీల్లో పెదగంట్యాడ, నడుపూరు, నెల్లిముక్కు ప్రాంతాలకు చెందిన పలువురు విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు శిబిరం ముగింపు రోజున బహుమతులు అందజేస్తామని గ్రంథాలయాధికారి రమణ తెలిపారు.

రాజీవ్‌గాంధీకి నివాళి

పెందుర్తి: గ్రేటర్ 97వ వార్డు పరిధి చినముషిడివాడ కాలనీలో గల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని నిర్వహించారు. పార్టీ సీనియర్ నాయకుడు విన్నకోట రాము ఆధ్వర్యంలో రాజీవ్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. నాయకుడు ఎం.రామునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాలతో కళాకృతులు

మల్కాపురం: వ్యర్థాలతో కళాకృతుల తయారీపై మల్కాపురం గ్రంథాలయంలో మంగళవారం వర్క్‌షాప్ నిర్వహించారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా చిన్నారులకు కాగితాలు, ఇతర వ్యర్థాలతో కళాకృతుల తయారీపై శిక్షణ ఇచ్చారు. జాతీయ సేవా పథకం సీనియర్ ప్రోగ్రాం అధికారి అనసూయాదేవి, జిల్లా ప్రోగ్రాం అధికారి భాగ్యలక్ష్మి, గ్రంథాలయాధికారి అజయ్‌కుమార్ పాల్గొన్నారు.


దుర్గాలమ్మ పూజల్లో కూటమి అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్


నక్కవానిపాలెంలో దుర్గమ్మ ప్రతిమలతో ఊరేగింపు

ఘనంగా కనకదుర్గమ్మ పండగ

సీతమ్మధార, మే 21: గ్రేటర్ 24వ వార్డులో నక్కవానిపాలెం గ్రామంలో ఏడుగుళ్లలో వెలసిన బెజవాడ కనకదుర్గమ్మ మహోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి అమ్మవారికి పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. నక్కవానిపాలెం, కాంత్రినగర్, గాంధీనగర్, పీఅండ్‌టీ కాలనీ, సీతమ్మధార, టీటీడీ కాలనీ, రేసపువానిపాలెం, మద్దిలపాలెం, చైతన్యనగర్ గ్రామాల ప్రజలు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. సాయంత్రంగామంలో రామాలయం వద్దనున్న అమ్మవారి పెద్దింటి నుంచి ఘటాలను, అమ్మవారి ప్రతిమలను భక్తులు ఊరేగింపుగా ఏడుగుళ్ల ఆలయం వరకు తీసుకువచ్చి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పులివేషాలు, అమ్మవారి వేషాలు, పూనల డాన్స్ తదితర సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గ్రామ దొడ్డి పెద్దలు, గ్రామ కోరు కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో ఈ మహోత్సవం నిర్వహించారు.

ఘనంగా దుర్గాలమ్మ మహోత్సవం

డాబాగార్డెన్స్, మే 21: జీవీఎంసీ 31వ వార్డు పరిధిలోని కృష్ణాగార్డెన్స్‌లోని శ్రీ దుర్గాలమ్మ మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి విశేష అలంకరణ, ప్రత్యేక పూజలు కార్యక్రమాలను నిర్వహించారు. దక్షిణ నియోజకవర్గ కూటమి అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమ్మవారి దయతో ప్రజలంతా సుఖంగా ఉండాలని కోరుకున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వానపల్లి వజీరాయత్రి కుమారి, సారిపల్లి మహేష్, నాని తదితరులు పాల్గొన్నారు.

పరదేశమ్మ అమ్మవారికి పూజలు

అక్కయ్యపాలెం: విశాఖ ఉత్తర నియోజకవర్గం 42వ వార్డు తాటిచెట్లపాలెంలో గల పరదేశమ్మ అమ్మవారి పండుగ మహోత్సవం సందర్భంగా అమ్మవారిని విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కెకె రాజు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీలి రమణ, ఆళ్ల శివగణేష్, పోలరాజు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

23 నుంచి దుర్గమ్మ ఉత్సవాలు

అక్కయ్యపాలెం: గ్రేటర్ 46వ వార్డు మధుసూదననగర్‌లోని లక్ష్మీ గణపతి సహిత కనకదుర్గ అమ్మవారి 30వ వార్షికోత్సవ మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్టు గ్రామ సేవా సంఘం అధ్యక్షులు కిలిమి రెడ్డి అప్పారావు, ఆలయ చైర్మన్ శీరంశెట్టి శంకరావు తెలిపారు. ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయన్నారు. గురువారం ఉదయం ఏడున్నర గంటలకు కలశ ప్రతిష్ఠాపనతో ఉత్సవాలు ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసశర్మ ప్రారంభిస్తుతారన్నారు. 26వ తేదీ ఆదివారం ప్రధాన పండగ ఉంటుందన్నారు. జూన్ రెండో తేది ఆదివారం మధ్యాహ్నం ఉంటుంది.

లేపాక్షి వద్ద ట్రాఫిక్ సర్కిల్ నిర్మాణంలో జాప్యం

» నిత్యం వాహనాల రాకపోకలకు కష్టాలు

జగదాంబ కూడలి, మే 21: లేపాక్షి జంక్షన్ నాలుగు రోడ్ల సర్కిల్ నిర్మాణ పనుల్లో జాప్యంతో నిత్యం ట్రాఫిక్ కష్టాలు తలెత్తుతున్నాయి. కేజీహెచ్ డౌన్ లేపాక్షి జంక్షన్ వద్ద ట్రాఫిక్ సర్కిల్‌ను రోడ్డు పనుల్లో భాగంగా జీవీఎంసీ స్మార్ట్ సిటీ అధికారులు తొలగించారు. అయితే, నాలుగువైపులా రోడ్డు విస్తరణ పనులు కొంత మేర చేపట్టారు. సర్కిల్‌ను మాత్రం వదిలేశారు. దీంతో నాలుగు వైపులా వాహనాల రాకపోకలతో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. దీనికి తోడు కేజీహెచ్ డౌన్ లక్ష్మీ షాపింగ్ మాల్ వద్ద చేపట్టిన కాలువ పనులు పూర్తికాకపోవడంతో పాదచారులు సైతం ఇబ్బందులు పడాల్సివస్తోంది. జగదాంబ జంక్షన్ క్లాక్ టవర్ నిర్మాణ పనుల్లో భాగంగా మెయిన్ రోడ్డు ఆధునికీకరణ పనులను జీవీఎంసీ స్మార్ట్ సిటీ ఇంజనీరింగ్ అధికారులు చేపట్టారు. క్లాక్ టవర్ నిర్మాణంతో పాటు అక్కడినుంచి లక్ష్మీ షాపింగ్ మాల్ వరకు మెయిన్ రోడ్డుకు ఇరువైపులా సెంటమూనంగా ఉండేలా చర్యలు తీసుకున్నారు. అయితే, లేపాక్షి వద్ద పోలీస్ సర్కిల్‌ను పూర్తిచేయకపోవడం గమనార్హం.


అస్తవ్యస్తంగా లేపాక్షి నాలుగు రోడ్ల సర్కిల్ వద్ద ట్రాఫిక్


జగదాంబనుంచి డివైడర్ నిర్మాణానికి వేసిన ఇసుక బస్తాలు

పోలీస్ సర్కిల్ పూర్తి చేయండి: జీవీఎంసీ కమిషనర్

లేపాక్షి జంక్షన్ వద్ద పోలీస్ సర్కిల్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని జీవీఎంసీ కమిషనర్ శ్రీకాంత్ వర్మ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం క్లాక్ టవర్ రోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. పనుల్లో జాప్యం చేయవద్దంటూ హెచ్చరించారు. లక్ష్మీవద్ద కాలువ నిర్మాణ పనులు నత్తనడక సాగడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు సజావుగా నిర్వహించాలి

» జేసీ మయూర్ అశోక్

విశాఖపట్నం, మే 21: జిల్లాలో ఈనెల 24 నుంచి జరుగనున్న పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు సజావుగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు. సార్వత్రిక విద్యాపీఠం నిర్వహించే పది, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలపై మంగళవారం తన చాంబర్‌లో సమన్వయ సమావేశం నిర్వహించారు. మే 24 నుంచి జూన్ 3 వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరిగే సప్లిమెంటరీ పరీక్షలకు 4,836 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. ఇందులో 2,578 మంది రెగ్యులర్, 2,258 మంది ప్రైవేటు విద్యార్థులు ఉన్నారన్నారు. 20 కేంద్రాలను ఎంపిక చేయడంతో పాటు అవసరమైన సిబ్బందిని నియమించామన్నారు. ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలపై మాట్లాడుతూ సక్రమంగా జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. డీఈవో కె.చెన్నారావు, కుమార్, డీఈవో ఎల్.చంద్రకళ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జేసీ మయూర్ అశోక్

అమ్మవారి ఉత్సవాల్లో రఘురామ కృష్ణరాజు

కంచరపాలెం, మే 21: రెడ్డికంచరపాలెం గ్రామ దేవత దుర్గాలమ్మ, కుంచాలమ్మ ప్రధాన పండగను గ్రామస్థులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తుమ్మపాలెం వద్ద అమ్మవారి ఆలయంలో ప్రత్యేక అలంకారాలు నిర్వహించారు. కంచరపాలెం పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.రెడ్డికంచరపాలెంలో అమ్మవారి ఘటాలను ఊరేగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అలాగే పశ్చిమ గోదావరి జిల్లా ఉండి నియోజకవర్గం ఉమ్మడి అభ్యర్థి రఘురామ కృష్ణరాజు, విశాఖ ఉత్తర కూటమి అభ్యర్థి విష్ణుకుమార్‌రాజు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరామా సేవా సంఘం పెద్దలతోపాటు 54వార్డు టీడీపీ అధ్యక్షుడు కుట్లా కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.


అమ్మవారిని దర్శించుకుంటున్న రఘురామకృష్ణరాజు, విష్ణుకుమార్ రాజు

తెలుగుజాతి పోరుషానికి ప్రతీక ఆర్‌ఆర్‌ఆర్

డాబాగార్డెన్స్: తెలుగుజాతి పౌరుషానికి ప్రతీకగా కెరమురామకృష్ణరాజు నిలిచారని తెలుగుశక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ అన్నారు. సోమవారం నగరానికి విచ్చేసిన ఆయనను రఘురామకృష్ణరాజును మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. బ్రిటిష్‌రాజ్యానికిచెందిన రామకృష్ణరాజును ఎంపీగా తాను ప్రాతినిధ్యం వహించిన సొంత వైసీపీ విధానాలు నచ్చక ఆ పాలనపై తిరగబడ్డారన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ నేత సౌజన్యతో ఆయన సన్మానం పొందారు. దువ్వి పరమేశ్వరరావు, వి.లక్ష్మణ్‌రెడ్డి, వసంతరావు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి

మహరాణిపేట, మే 21: మాజీ ప్రధాని మంత్రి దివంగత రాజీవ్ గాంధీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. మంగళవారం బీచ్‌రోడ్డులోని రాజీవ్ స్మృతి భవన్ వద్ద ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, పీసీసీ ప్రతినిధి సయ్యద్ అబీదా, పాసర్ల ప్రసాద్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దేశానికి రాజీవ్ చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు విజయ్‌చంద్ర, పాసర్ల వసంత కళ్యాణి, గణేష్, గురునాధరావు, లీలా ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.



మెరుగైన సమాచారం పంచుకోవడమే ఐఎంపీసీసీ లక్ష్యం

» ఏఐఆర్ ఏపీ రీజియన్ అదనపు డైరెక్టర్ జనరల్ రాజేందర్‌చౌదరి

డాబాగార్డెన్స్, మే 21: ఐఎంపీసీసీ సమావేశం ద్వారా వివిధ సంస్థలను సమన్వయం చేసుకుని మెరుగైన సమాచారాన్ని అందించనున్నట్టు పీఐబీ ఏపీ రీజియన్ అదనపు డైరెక్టర్ జనరల్ రాజేందర్‌చౌదరి పేర్కొన్నారు. సిరిపురం ఆలిండియా రేడియో స్టేషన్‌లో ఇంటర్‌మీడియా పబ్లిసిటీ కోఆర్డినేషన్ కమిటీ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈకార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర మీడియా యూనిట్లు, పీఎస్‌యూల ద్వారా ప్రతి సంస్థలో చేపడుతున్న వివిధ కార్యకలాపాలు ఫెయిలెట్ చేయడం ఐఎంపీసీసీ లక్ష్యమన్నారు. పీఐబీనెట్ వర్క్‌ను అభివృద్ధి చేసి, మీడియా ఏకీకరణ, ఇతర అంశాల్లో ఆశించిన ఫలితాలను కచ్చితంగా సాధిస్తుందన్నారు. ప్రభుత్వ విధానాలు, కార్యక్రమాలపై ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాకు సమాచారాన్ని అందజేయడంలో విజయవాడలోని పత్రిక సమాచార కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఏపీ రీజియన్ ప్రాంతీయ కార్యాలయం సాధించిన విజయాలను ఈసందర్భంగా ఆయన వివరించారు. పీఐబీ ప్రభుత్వానికి, మీడియాకు మధ్య వారధిగా పనిచేస్తుందన్నారు. ప్రభుత్వ శాఖలు, పీఎస్‌యూలు, మీడియా యూనిట్లలోని వాటాదారులు దరి మధ్య సమగ్ర కమ్యూనికేషన్, మేనేజ్‌మెంట్ వ్యూహాన్ని రూపొందించడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు దర్శనం ప్రజలకు చేరవేయడమే ఈ సమావేశం ఉద్దేశమన్నారు. సెంట్రల్ మీడియా యూనిట్లు, ఆకాశవాణి రేడియో, దూరదర్శన్, డీఎవీపీ సీ, ఇండియా పోస్ట్, నెహ్రూ యువకేంద్రం సంఘటన్, బీఎస్‌ఎన్‌ఎల్, ఎయిర్‌పోర్ట్ అథారిటీ అధిపతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాజేందర్ చౌదరి

గుర్తు తెలియని యువకుడి ఆత్మహత్య

మర్రిపాలెం, మే 21: గుర్తు తెలియని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మర్రిపాలెం రైల్వేస్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. ఎయిర్‌పోర్ట్ పోలీసులు తెలిపిన వివరాలిలా.. మర్రిపాలెం జంక్షన్ నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే మార్గంలో ఉన్న ఓ టెలిఫోన్ సెంటర్ రేకుల షెడ్డు పైభాగంలో గుర్తుతెలియని వ్యక్తి కేబుల్‌వైర్‌తో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని ఉండటాన్ని మంగళవారం తెల్లవారుజామున స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమందించారు. పోలీసులు వచ్చి మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఆచూకీ తెలిస్తే 0891 2520812, సీఐ 9440904350 సంప్రదించాలి. సీఐ చక్రధరరావు నేతృత్వంలో పోలీసులు కేసుదర్యాప్తు చేస్తున్నారు.


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

గాజువాక కోర్టు ఆవరణలో యువకుడి ఆత్మహత్యాయత్నం

గాజువాక, మే 21: దొంగతనం కేసులో అరెస్టు అయిన వ్యక్తిని పోలీసులు కోర్టుకు తీసుకువస్తుండగా న్యాయస్థానం ఆవరణలో ఆ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. మల్కాపురం ప్రాంతానికి చెందిన ఐ.సాయి (21)ని ఓ దొంగతనం కేసులో దువ్వాడ క్రైమ్ పోలీసులు అరెస్టు చేసి మంగళవారం కోర్టుకు తీసుకువచ్చారు. ఈ క్రమంలో సాయి బ్లేడ్‌తో ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. స్వల్పంగా గాయపడిన సాయిని చికిత్సకు పోలీసులు కేజీహెచ్‌కు తరలించారు.

అంగన్‌వాడీ యూనియన్ నేత తులసి మృతి

సీతంపేట/ అల్లిపురం, మే 21: అంగన్‌వాడీ యూనియన్ సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు కామ్రేడ్ తులసి సోమవారం రాత్రి గుండెపోటుతో ఆకస్మికంగా మృతిచెందారు.ఈమె మృతికి సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి కుమార్, సీపీఎం కార్యదర్శి ఎం. జగ్గునాయుడు, కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు సంతాపాన్ని ప్రకటించారు. తులసి అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి ఎనలేని కృషి చేశారన్నారు. జనవరిలో ఉద్యోగులుచేపట్టిన విజయవంతానికి విశేష కృషి చేశారన్నారు. అల్లిపురంలో జరిగిన తులసి భౌతికాయం అంతిమయాత్రలో పెద్ద సంఖ్యలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొని నివాళులర్పించారు.


తులసి (ఫైల్)

ఓటర్లకు లంచం ఇచ్చే సంస్కృతిని అరికట్టాలి

» ఆదికవి నన్నయ వర్సిటీ మాజీ వీసీ ఆచార్య ముత్యాలనాయుడు

డాబాగార్డెన్స్, మే 21: ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన సార్వత్రిక ఎన్నికల ప్రక్రియను చూస్తే ప్రజాస్వామ్యంలో రాజకీయాలు కాకుండా.. ధనస్వామ్యమే రాజ్యమేలినట్టు కనిపించిందని ఆదికవి నన్నయ యూనివర్సిటీ మాజీ వీసీ ఆచార్య ముత్యాలనాయుడు అన్నారు. పలు పార్టీలకు చెందిన నేతలు పట్టపగలే డబ్బుపంచుతూ ఓట్లు అడగడం దారుణమని అన్నారు. మంగళవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటర్లకు లంచాన్ని సులభతరం చేసే అన్ని అక్రమ లావాదేవీలను అరికట్టేలా సంస్కరణలు తేవాలన్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే ప్రధానమంత్రి నరేంద్రమోదీ, రాష్ట్రపతి, అన్ని రాజకీయ పార్టీల అధిపతులకు లేఖలు రాసినట్టు తెలిపారు. ఓటు అన్నది రహస్యంగా ఉండాలని, అయితే ఇటీవల ఎన్నికల్లో ఒక్కో ఓటు కోసం రూ.1500 వరకు తోచనీయమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అంధ్రప్రదేశ్‌లోని పోలింగ్ దారుణాలు, దన ప్రవాహంపై అంతర్జాతీయ పత్రికల్లో సైతం ప్రచురితం కావడం పాలకుల వైఖరి విమిటో స్పష్టమవుతోందన్నారు. ఎన్నికల్లో దాదాపు ఒక్కో నియోజకవర్గంలో అభ్యర్థి, ప్రత్యర్థి పార్టీలు రూ.50 కోట్లు ఖర్చు చేస్తున్నారని రాష్ట్ర వ్యాప్తంగా రూ. 8250 కోట్లు వ్యయం చేసినట్టు అన్నారు. ఈ సొమ్మంతా ఎక్కడి నుంచి వచ్చిందని ఆయన ప్రశ్నించారు.


మాట్లాడుతున్న ముత్యాలనాయుడు

రీ షెడ్యూల్‌తో ఆలస్యంగా నడుస్తున్న రైళ్లు

ఐదున్నర గంటలు ఆలస్యంగా నాందేడు ఎక్స్‌ప్రెస్

విశాఖపట్నం, మే 21: రైల్ రీషెడ్యూల్‌తో విశాఖ- నాందేడు ఎక్స్‌ప్రెస్ (20811) ఐదున్నర గంటలు ఆలస్యంగా బయలుదేరింది. మంగళవారం రాత్రి 8.00 గంటలకు విశాఖలో బయలుదేరాల్సిన ఈ రైలు బుధవారం తెల్లవారుజాము 1.30 బయలుదేరే విధంగా రీ షెడ్యూల్ చేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ముందస్తు సమాచారమందుకున్న కొందరు ప్రయాణికులు ఆలస్యంగా స్టేషన్‌కు రాగా, సమాచారం అందని వారు ముందుగా స్టేషన్‌కు చేరుకుని నిరీక్షించారు. కాగా, ఇత రైళ్లు అందుబాటులో లేక పాలిమార్-సికింద్రాబాద్ ప్రత్యేక రైలు (07226), ఎస్ఎంవీ బెంగళూరు-హౌరా హంసఫర్ ఎక్స్‌ప్రెస్ (12503), తంబరం-సంత్రాగచ్చి అంత్యోదయ ఎక్స్‌ప్రెస్ (22842) రైళ్లను మంగళవారం రీ షెడ్యూల్ చేసి నడిపించడంతో ప్రయాణికులకు అవస్థలు తప్పలేదు.

అటవీశాఖలో అమెజాన్ ఒప్పందం

విశాఖపట్నం, మే 21 (ఆంధ్రజ్యోతి): గిరిజన సమాజ అభివృద్ధి, సాంస్కృతిక పరిరక్షణ ద్వారా గిరిజన కళాకారులకు సాధికారత కల్పించే విషయంలో అమెజాన్‌తో అటవీశాఖ ఒప్పందం కుదుర్చుకుంది. అమెజాన్‌కు చెందిన ఈ-కామర్స్ వేదిక ద్వారా గిరిజనుల ఉత్పత్తులు, కంబాలకొండ ఆభయారణ్యంలో నివసిస్తున్న శంభువానిపాలెం గిరిజన వర్గాల గొప్ప వారసత్వం ప్రపంచానికి పరిచయంచేసే లక్ష్యంతో ఒప్పందం జరిగింది. ఇందుకు సంబంధించి ఈ మేరకు విశాఖ డివిజనల్ అటవీ అధికారి అనంతశంకర్, అమెజాన్ ఇండియా సెల్లర్ ఆక్సిజేషన్ అండ్ డెవలప్‌మెంట్ విభాగాధిపతి గౌరవ భట్నాగర్ ఒప్పందపై సంతకాలు చేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సీతమ్మధార: నిర్వహణ పనులనిమిత్తం బుధవారం ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ జోన్ 1 ఈఈ బి.సింహాచలం తెలిపారు.ఎంజీఓ. ఆఫీస్, పి అండ్ టీ కాలనీ పోస్ట్ ఆఫీస్, గాంధీనగర్ సత్యం జంక్షన్, బాలాజీ డార్లింగ్ హైట్స్ అపార్ట్‌మెంట్‌తదితర ప్రాంతాల వినియోగదారులు సహకరించాలన్నారు.

జగదాంబ వద్ద ఫుట్‌పాత్‌పై ఆక్రమణల తొలగింపు

జగదాంబ కూడలి, మే 21: జగదాంబ కూడలి వాచ్‌హౌస్, దసపల్లా హోటల్ తదితర మెయిన్ రోడ్డు ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు పోలీసులు తొలగించారు. మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో వ్యాపారులు దుకాణాలు ఏర్పాటుకు సిద్ధమవుతుండగా, టుటౌన్ ట్రాఫిక్ సీఐ రేవతమ్మ ఆధ్వర్యంలో పోలీసులు వచ్చి ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలను తొలగించాలని ఆదేశించారు. ఫుట్‌పాత్ వ్యాపారాలు బతుకుతున్నామని, వాటిని తొలగిస్తే ఎలా అంటూ వ్యాపారులు తమ మొరపెట్టుకున్నారు. ట్రాఫిక్ పోలీసులు మాత్రం జీవీఎంసీ కమిషనర్ నుంచి ఆదేశాలు రావడంతో తాము ఖాళీ చేస్తున్నట్టు వివరించారు. ఏమైనా సమస్యలుంటే, కమిషనర్‌తో మాట్లాడాలని ట్రాఫిక్ సీఐ రేవతమ్మ స్పష్టంచేశారు. అనంతరం దసపల్లా రోడ్డుపై వ్యాపారాలు సామాగ్రిని జీవీఎంసీ వ్యాన్‌లో ఎక్కించి తరలించారు. జోనల్ కార్యాలయంలో అధికారులను కలిసి ఈ సామా గ్రి తీసుకువెళ్లాలంటూ పోలీసులు సూచించారు. జగదాంబ జంక్షన్ నుంచి టర్నర్ చౌల్ట్రీ వరకు ఉన్న ఫుట్‌పాత్ వ్యాపారాలను పోలీసులు, జీవీఎంసీ సిబ్బంది తొలగించారు. ఇటీవల రోడ్డు విస్తరణలో భాగంగా మెయిన్‌రోడ్లో ఫుట్‌పాత్‌లను జీవీఎంసీ ఆధునికీకరించింది. ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తుండటంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. రెండు రోజులుగా జీవీఎంసీ కమిషనర్ శ్రీకాంత్ వర్మ జగదాంబ వద్ద క్లాక్ టవర్ మెయిన్ రోడ్డు పనులు పరిశీలిస్తున్నారు. దీంతో ఫుట్‌పాత్‌ల ఆ క్రమణలతో తలెత్తుతున్న ఇబ్బందులు గుర్తించారు.లేపాక్షి వద్ద ఆక్రమణలు తొలగించాలని కొంత మంది జీవీఎంసీ అధికారులు, పోలీసుల దృష్టి తెచ్చారు. ఈనేపథ్యంలో చర్యలు తీసుకున్నారు.


వ్యాపారుల దుకాణాలను తొలగిస్తున్న పోలీసులు

మహిళా ఓటర్లపైనే వైసీపీ ఆశలు

... 5వ పేజీ తరువాయి

సీట్లు రావడం ఖాయమని చెప్పడానికి కారణం ఏమై ఉంటుందనే దానిపై రకరకాల విశ్లేషణలు సాగుతున్నాయి. మహిళా ఓటర్లు తమ వైపు మొగ్గు చూపారనే ధీమానే అందుకు కారణమని ఆ పార్టీ అభ్యర్థులతోపాటు నేతలు పేర్కొంటున్నారు. ఉద్యోగులు, యువతలో తమకు కొంత వ్యతిరేకత ఉన్నప్పటికీ, నిరుపేదలు, దిగువ మధ్య తరగతికి సంక్షేమ పథకాలు అందడంతో వారంతా తమ పార్టీ అభ్యర్థులకు ఓటేశారని అభిప్రాయంలో వైసీపీ నేతలు ఉన్నారు. ఇక మహిళలకు తమ ప్రభుత్వంలో ఎంతో మేలు జరిగిందని, పైగా వారి ఓట్లు లక్ష్యంగా తమ అభ్యర్థులు పోల్ మేనేజ్‌మెంట్ చేయడం కలిసొస్తుందని విశ్లేషిస్తున్నారు. వీటన్నింటిని పరిగణనలోకి తీసుకుంటే స్వల్ప మెజారిటీలతోనైనా తమ అభ్యర్థులు బయటపడతారనే ఆశాభావంతో వైసీపీ నాయకులు ఉన్నారు.

వైసీపీ నేతల్లో లోలోన ఆందోళన

విజయంపై వైసీపీ నేతలు బయటకు విశ్వాసం వ్యక్తం చేస్తున్నప్పటికీ లోలోపల మాత్రం ఆందోళన చెందుతున్నారు. మహిళలంతా తమకే ఓటేశారని లెక్కించుకోవడం సరికాదని, మహా అయితే ఐదు శాతానికి మించి వ్యత్యాసం ఉండే అవకాశం కనిపించడం లేదని అభిప్రాయపడుతున్నారు. విశాఖ జిల్లాలో 20,12,373 మంది ఓటర్లు ఉండగా వీరిలో 14,09,118 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో 6,85,877 మంది పురుషులు కాగా మహిళలు 7,23,197, ఇతరులు 44 మంది ఉన్నారు. నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే భీమిలి నియోజకవర్గంలో 2,75,747 ఓట్లు పోలవ్వగా అందులో 1,40,446 ఓట్లు మహిళలవే. అలాగే విశాఖ తూర్పు నియోజకవర్గ పరిధిలో 2,00,563 ఓట్లు పోలవ్వగా 1,04,924 ఓట్లు, దక్షిణ నియోజకవర్గ పరిధిలో 1,37,474 ఓట్లు పోలవగా 71,209 ఓట్లు, విశాఖ ఉత్తర నియోజకవర్గంలో 1,84,703 ఓట్లు పోలవ్వగా 94,566 ఓట్లు, పశ్చిమ నియోజకవర్గ పరిధిలో 1,48,942 ఓట్లు పోలైతే వాటిలో 77,781 ఓట్లు, గాజువాక పరిధిలో పోలైన 2,32,949 ఓట్లలో 1,18,105 మహిళలవి. ఇక పెందుర్తి నియోజకవర్గంలో పోలైన 2,28,740 ఓట్లు పోలైతే వాటిలో 1,16,766 ఓట్లు మహిళలవే కావడం విశేషం. ప్రతి నియోజకవర్గంలోనూ పోలైన ఓట్లలో సగానికిపైగా ఓట్లు మహిళలవే కాబట్టి, వారిలో 50 శాతానికిపైగా తమకే ఓటు వేస్తారని వైసీపీ నేతలు భావిస్తున్నారు. అందులో ఏమాత్రం తేడా జరిగినా తమకు ఓటమి తప్పదని అంగీకరిస్తుండడం విశేషం. వైసీపీ నేతల లెక్కలను టీడీపీ నేతలు కొట్టిపారేస్తున్నారు. ఈ వర్గం, ఆ వర్గం అనే తేడా లేకుండా అన్ని వర్గాలు కూటమి అభ్యర్థులకు మద్దతు తెలిపారని, జిల్లాలో ఏడుకు ఏడు సీట్లు గెలుచుకుంటామని ధీమాగా చెబుతున్నారు.

ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు

... 5వ పేజీ తరువాయి

పార్లమెంటు నియోజకవర్గ పోస్టల్ బ్యాలెట్లు ఈతతం విభాగం సెమినార్ హాలులో నిర్వహించనున్నారు. భీమిలి నియోజకవర్గ అసెంబ్లీ ఓట్ల లెక్కింపు న్యూక్లాస్ రూమ్ కాంప్లెక్స్‌లోని గ్రౌండ్ ఫ్లోర్‌లో రూమ్ నంబరు-5, పార్లమెంటు ఈవీఎంలు రూమ్ నంబరు-7, విశాఖ తూర్పు అసెంబ్లీ ఓట్లు రూమ్ నంబరు-8, పార్లమెంటు ఓట్లు మొదటి అంతస్తు రూమ్ నంబరు-10లో చేపడతారు. విశాఖ దక్షిణ నియోజకవర్గ అసెంబ్లీ, పార్లమెంటు ఓట్లు ఫార్మసీ కాలేజీ సైన్స్ ఇంజనీరింగ్ విభాగం మొదటి అంతస్తులో చేపడతారు. న్యూక్లాస్‌రూమ్ మొదటి అంతస్తు రూమ్-1లో విశాఖ ఉత్తర నియోజకవర్గ అసెంబ్లీ సెగ్మెంట్, రూమ్ నంబరు-5లో పార్లమెంటు నియోజకవర్గ ఓట్లు లెక్కిస్తారు. ఇనుస్ట్రుమెంటేషన్ విభాగంలో సెమినార్ హాలులో విశాఖ పశ్చిమ అసెంబ్లీ, క్లాస్‌రూమ్-5లో పార్లమెంటు ఓట్లు, కెమికల్ ఇంజనీరింగ్ విభాగం కింద అంతస్తులోని డ్రాయింగ్‌రూమ్‌లో గాజువాక అసెంబ్లీ, మొదటి అంతస్తులోని సెమినార్ హాలులో పార్లమెంటు, ఇంజనీరింగ్ కళాశాల మెయిన్‌బ్లాక్‌లో రూమ్ నంబరు 205లో పెందుర్తి అసెంబ్లీ, మొదటి అంతస్తులో రూమ్ నంబరు 202లో పార్లమెంటు నియోజకవర్గ ఓట్లు లెక్కింపు చేపడతారు.

స్ట్రాంగ్ రూముల తనిఖీ

ఏయూ ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో బ్యాలెట్లు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్‌లను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ఎ.మల్లికార్జున మంగళవారం తనిఖీ చేశారు. జాయింట్ సీపీ ఫకీరప్పతో కలిసి ఆయన పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన స్ట్రాంగ్‌రూమ్‌లను తనిఖీ చేశారు. సీసీ కెమెరాల పనితీరు ద్వారా నిర్వహణ తీరుపై ఆరా తీశారు. కంట్రోల్ రూమ్‌ను తనిఖీ చేశారు. భద్రతా సిబ్బంది, అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచన చేశారు. కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు ఉన్నారు.

పర్యాటకంపై నిర్లక్ష్యం

... 5వ పేజీ తరువాయి

పర్యాటక గెస్ట్‌హౌస్‌లను రాజధాని అవసరాల పేరుతో తీసేసుకొని... విశాఖపట్నం వచ్చేవారికి పటువంటి వసతి లేకుండా చేశారు. దాంతో అధిక మొత్తాలు వెచ్చించి ప్రైవేటు హోటళ్లకు ఆశ్రయించాల్సిన పరిస్థితి.

విశాఖపట్నాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని చెబుతున్న నాయకులు ఈ ఐదేళ్లలో ఏమీ చేయలేకపోయారు. ఉన్న ఆస్తులను కొల్లగొట్టారు. ఖరీదైన భూములను రిసార్ట్ నిర్మాణం పేరుతో పెద్ద సంస్థలకు కట్టబెట్టారు. ఆది కూడా సామాన్య పర్యాటకులకు అందుబాటులో ఉండే విధంగా కాకుండా విలాసాల్లో వచ్చేవారికే రోజుకు రూ.వేలకు వేలు పైగా అద్దె వెల్లించే స్తోమత ఉన్నవారి కోసం నిర్మిస్తున్నారు.

పర్యాటకులను ఇస్తే తప్పేమిటి?

- మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు

రుషికొండలో ఆధునిక వసతులతో పర్యాటకుల కోసం భవన సముదాయాలు నిర్మించారు. ప్రారంభోత్సవం కూడా చేశారు. ప్రస్తుతం అవి ఖాళీగానే ఉన్నాయి. సీఎం నివాసం కోసం వాటిని పక్కనపెట్టడం సరికాదు. విశాఖలో పర్యాటకులకు ప్రభుత్వ వసతి లేనందున తక్షణమే వాటి వివరాలు వెబ్‌సైట్‌లో పెట్టి పర్యాటకులకు కేటాయించాలి. ఆ విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి. ప్రజాధనం వృథా కాకుండా చూడాలి.

పెందుర్తి ప్రాంతంలో తెలంగాణ ఏసీబీ తనిఖీలు

... 5వ పేజీ తరువాయి

కుమారుడు జోగినాయుడు పోలీస్ స్పెషల్ పార్టీలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. ప్రస్తుతం విశాఖ సింహాచలం దేవస్థానం సెక్యూరిటీ విభాగంలో విధులు నిర్వహిస్తున్నాడు. జోగినాయుడు, డీఎస్పీ ఉమామహేశ్వరరావు బంధువులకు సంబంధాలు ఉండడంతో ఏసీబీ సోదాలు చేసినట్టు సమాచారం. సోదాల వివరాలు వెల్లడించడానికి ఏసీబీ అధికారులు నిరాకరించారు.

నేత్రపర్వంగా అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, మే 21: వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్యకల్యాణోత్సవం నేత్రపర్వంగా సాగింది. మంగళవారం వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు యథావిధిగా జరిపారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ప్రత్యక్షంగా పాల్గొన్న భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలు చేసి షోడశోపచారాలు సమర్పించారు. ఆగమోక్తముగా కంకణ ధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణ, జీలకర్ర బెల్లం, మాంగళ్య సమర్పణలు కావించి అక్షితారోపణం జరిపారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేష వస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

అనాథ వృద్ధులకు స్వామి దర్శనం



దర్శనం అనంతరం ఆలయం బయట వృద్ధులు

సింహాచలం, మే 21: వరాహలక్ష్మీనృసింహస్వామిని శ్రీకాకుళం జిల్లా వావిలవలస గ్రామానికి చెందిన సౌరబ్ నిత్యాన్నదాన సత్రం సభ్యులకు ఉచిత దర్శనం కల్పించారు. సత్రం నిర్వాహకులు సాలూరు సిద్ధార్థ వృద్ధులను ప్రత్యేక బస్సులో సింహగిరికి తీసుకురాగా ఏఈఓ ఆనందకుమార్, పర్యవేక్షణాధికారి వెంకటరమణ వారందరికీ అంతరాలయ దర్శనం, కప్పస్తంభ ఆలింగనం, వేదాశీర్వచనాలు, ప్రసాదాలను అందజేశారు.

సింహాచలానికి భారీగా భక్తులు

సింహాచలం, మే 21: వరాహలక్ష్మీనృసింహస్వామి దర్శనానికి పదుల సంఖ్యలో బస్సులలో భక్తులు తరలివస్తున్నారు. మంగళవారం దాదాపే పది టూరిస్టు బస్సులు బీఆర్‌టీఎస్ రోడ్డులో నిలిపిఉంచి, భక్తులు కొండపైకి చేరుకున్నారు.

నేడు నృసింహ జయంతి

సింహాచలం, మే 21: నృసింహస్వామి ఆవిర్భావ నక్షత్ర స్వాతిని పురస్కరించుకుని ఈనెల 22న నృసింహ వనంలోని స్వామివారి విగ్రహం వద్ద సాయంత్రం నాలుగు గంటలకు 'నృసింహ జయంతి'ని నిర్వహించనున్నారు. ఉత్తర రాజగోపురానికి ఎదురుగా ఉన్న మైదానంలో ఉదయం 8 గంటల నుంచి పూజలు ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలను పురస్కరించుకుని 22న సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే భక్తులకు స్వామివారి సర్వదర్శనాలు లభిస్తాయన్నారు. స్వాతి హోమంలో పాల్గొనదలచిన భక్తులు పీఆర్వో కార్యాలయంలో ప్రత్యక్షంగా లేదా ఆన్‌లైన్‌లో టికెట్లను పొందవచ్చునన్నారు.

ముగిసిన రెండో విడత చందనం అరగదీత

సింహాచలం: వరాహ లక్ష్మీనృసింహస్వామికి రానున్న వైశాఖ పూర్ణిమ నాటి తెల్లవారుజామున సమర్పించేందుకు అవసరమైన శ్రీచందనం అరగదీత రెండో విడత మంగళవారంతో ముగిసింది. ఈనెల 18నుంచి ప్రారంభించిన అరగదీతలో ఆలయ సిబ్బంది 18మంది పాల్గొన్నారు. మంగళవారం అరగదీసిన సుమారు 15 కిలోల చందనాన్ని ఏఈఓ ఎన్.ఆనందకుమార్, స్థానాచార్యులు డా.టీపీ రాజగోపాల్ తూనిక వేసి పద్మనిధిలో భద్రపరచారు. సుగంధ ద్రవ్యాల చూర్ణాలను మిళితం చేసిన తరువాత స్వామికి పైపూతగా సమర్పిస్తారు.

'యూజర్ చార్జీలను రద్దుచేయండి'

విశాఖపట్నం, మే 21 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధిలో చెత్తసేకరణకు ప్రజల నుంచి వసూలుచేస్తున్న యూజర్ చార్జీలను తక్షణం రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఫ్లోర్‌లీడర్ బి.గంగారావు మంగళవారం మేయర్ గొలగాని హరివెంకటకుమారికి లేఖ రాశారు. యూజర్ చార్జీల పేరుతో నగర ప్రజలపై నెలకు రూ.ఐదు కోట్లు భారం మోపుతున్నారన్నారు. అదే సమయంలో చార్జీలను 20 శాతం పెంచే యోచనలో జీవీఎంసీ ఉన్నట్టు తమకు సమాచారం ఉందని లేఖలో పేర్కొన్నారు. తూర్పు, ఉత్తర, పశ్చిమ నియోజకవర్గాల్లో కొళాయిలకు మీటర్లు బిగించే చర్యలకు తెరవెనుక ప్రయత్నాలు జరుగుతున్నాయని, దీనివల్ల ప్రజలపై ఒకేసారి భారం పెరిగిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణం జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం ఏర్పాటుచేసియూజర్ చార్జీలను రద్దు చేస్తూ తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు.

సినిమా గైడ్

- **బాక్ :** జగదాంబ, శ్రీరామ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీ (గాజువాక)
- **ఆ ఒక్కటి అడక్కు :** మెలోడీ, సంగం, కిన్నెర, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), లిఖిత(శ్రీహరిపురం), శ్రీకన్య-2 (గాజువాక), శ్రీకన్య సినీపోలీస్ , దుర్గ, (మధురవాడ).
- **ప్రసన్నవదనం :** శరత్, వెంకటేశ్వర-1, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం),
- **శబరి :** వెంకటేశ్వర.
- **రత్నం :** అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్ (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), రాములమ్మ (తగరపువలస)
- **గీతాంజలి మళ్ళీ వచ్చింది :** రమాదేవి, మౌర్య (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **ది ఫ్యామిలీ స్టార్ :** కామేశ్వరి, శ్రీనరసింహ (గోపాలపట్నం)
- **టిల్లు స్క్వేర్ :** శారద, మోహిని (గాజువాక),
- **గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ :** శ్రీవెంకటేశ్వర

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 27, టమాటా 28, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 32, పచ్చిమిర్చి 56, కాకరకాయలు 36, బీరకాయలు 46, ఆనపకాయలు 20, కాలీఫ్లవర్ 32, క్యాబేజ్ 22, క్యారెట్ 28, దొండకాయలు 36, బంగాళా దుంపలు 27, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 34, అల్లం (పాతది) 160, బరబటి 50, ముల్లంగి 42, నిమ్మకాయలు (కిలో) 80, గోరుచిక్కుడు 36, దోస కాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 190, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 70, పొటల్స్ 44, కీరదోస 26, కాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 35, చిలగడదుంపలు 42, కంద 64, దేముడు చిక్కుడు 52, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 40.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	138
ఫారం ధర	158
విత్ స్కిన్	286
స్కిన్‌లెస్	296

విజ్ఞానాన్ని అందించే జీవ వైవిధ్య కేంద్రం

- సందర్శకులకు పర్యాటక శాఖ అవగాహన కార్యక్రమాలు
- నేడు అంతర్జాతీయ బయోడైవర్సిటీ డే



అటవీశాఖ నిర్వహిస్తున్న బయో డైవర్సిటీ పార్కులో ఏర్పాటు చేసిన నక్షత్ర వనం

ఎంవీపీ కాలనీ, మే 21: పర్యావరణంపై అవగాహన కల్పించేందుకు వీలుగా అటవీశాఖ పలు చర్యలు తీసుకుంటోంది. ప్రజల్లో చైతన్యం కలిగేలా కొన్ని కేంద్రాలను నెలకొల్పి, వారిని ఆహ్వానిస్తోంది. ఈ కోవలోనే జూ పార్కు, ఎండాడ మధ్య జాతీయ రహదారిని ఆనుకుని ఇటీవల జీవ వైవిధ్య కేంద్రాన్ని నిర్మించింది. ఇక్కడకు వచ్చే సందర్శకులకు పర్యావరణం పట్ల అవగాహన పెంచుకునేందుకు తోడ్పడుతోంది. ఇందులో ఔషధ వనం పేరిట 90 రకాల మొక్కలను పెంచుతున్నారు. ఆర్కిడారియం జాతులు 30 వరకూ ఉన్నాయి. ఇవి ఇంట్లోని తేమ, ఉష్ణోగ్రత నియంత్రణకు సహాయపడతాయి. అలాగే ఫెర్న్ మొక్కలు నాచుతో వర్షారణ్యం వాతావరణాన్ని కాపాడుతుంది. ఇక నేచర్ ఇన్స్పిరేషన్ సెంటర్ పేరిట పలు అంశాలను వివరించే కేంద్రంగా రూపొందించారు. వన సంపద పేరిట సావనీర్ సెంటర్‌ను ఏర్పాటుచేశారు. ఇందులో సమీప గిరిజన గ్రామమైన సంబువానిపాలెం గిరిజన మహిళల చేతుల్లో రూపుదిద్దుకున్న కళాకృతులను ప్రదర్శనగా ఉంచారు. అలాగే కంబాలకొండ కూడా ఒక అభయారణ్య ప్రాంతం ఇందులో ఆసక్తి ఉన్న వారు నాలుగు, ఏడు కిలోమీటర్ల ట్రెక్కింగ్ చేసే అవకాశం ఉంది. కాంక్రీట్ జంగిల్‌గా మారిపోతున్న నగరం మధ్యలో దట్టమైన అటవీ ప్రాంతం నేచర్ పార్కులో కనిపిస్తుంది.

అవగాహన కార్యక్రమాలు

అంతర్జాతీయ బయోడైవర్సిటీ డే సందర్భంగా బుధవారం పర్యాటకశాఖ అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు జిల్లా పర్యాటక శాఖాధికారి జి జ్ఞానవేణి తెలిపారు. కంబాలకొండ, జీవ వైవిధ్య కేంద్రంవంటి పర్యావరణ స్థలాల సందర్శనకు వచ్చే వారికి పర్యావరణంపై అవగాహన కల్పించేందుకు తమ బృందం అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.

నేడు జీవవైవిధ్య సదస్సు

విశాఖపట్నం, మే 21 (ఆంధ్రజ్యోతి): జీవవైవిధ్య దినోత్సవం పురస్కరించుకుని బుధవారం ఉదయం ఆంధ్రవిశ్వవిద్యాలయం కన్వెన్షన్ హాల్లో జాతీయస్థాయి సదస్సు నిర్వహించనున్నారు. జీవ వైవిధ్య మండలి ఆధ్వర్యంలో జరిగే సదస్సుకు అటవీశాఖ ప్రిన్సిపల్ సీసీఎఫ్ చిరంజీవి చౌదరి ముఖ్య అతిథిగా హాజరవుతారని అధికారులు తెలిపారు.

భక్తి,శ్రద్ధలతో లక్ష్మీనరసింహస్వామి జయంతి



నరసింహస్వామి జయంతి సందర్భంగా పూజలు చేస్తున్న దృశ్యం

భీమునిపట్నం, మే 21: స్థానిక శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం నరసింహస్వామి జయంతి ఘనంగా జరిగింది. సాయంత్రం ఆరు గంటలకు ఆలయ వంశపారం పర్యార్చకులు రొంపిచెర్ల సంగరాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి ద్వాత్రింశ 32 కలశలతో దివ్య ఔషధులు, పంచామృతాలతో వేదోక్తంగా దివ్యాభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులకు ఆలయ విశిష్టతను, స్వామి వారి జయంతి విశేషాలను వివరించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు లక్ష్మీనరసింహ ప్రసాదాచార్యులు, కృష్ణమాచార్యులు, గుగ్గిళ్ళ గోపాలం, మణి, భక్తులు పాల్గొన్నారు.

గ్రామస్థాయిలో కేన్సర్ స్ర్కీనింగ్‌కు కార్యాచరణ

- ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వర్



నిపుణులతో మాట్లాడుతున్న వెంకటేశ్వర్

అగనంపూడి, మే 21: గ్రామ స్థాయిలో కేన్సర్ స్ర్కీనింగ్‌కు కార్యాచరణ ప్రణాళికను వైద్య ఆరోగ్యశాఖ సిద్ధం చేస్తుందని, ఇందులో భాగంగా రాష్ట్ర స్థాయిలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పేర్కొన్నారు. ఇక్కడి హోమీబాబా కేన్సర్ ఆస్పత్రి, పరిశోధన కేంద్రంలో నేషనల్ హెల్త్ మిషన్ ఆధ్వర్యంలో ప్రివెంటివ్ అంకాలజీ, కమ్యూనిటీ హెల్త్ మెడిసిన్, గైనకాలజీ, ఈఎన్‌టీ, డెంటిస్ట్రీ, పేథాలజీ, సర్జరీ విభాగాల్లోని వైద్య నిపుణులతో మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో శిక్షణ ఇచ్చేందుకు మంచి మానవ వనరులు ఉన్నాయన్నారు. శిక్షణ పొందిన వైద్య నిపుణులు జిల్లా స్థాయిలో శిక్షణ ఇవ్వడంతో పాటు ఏఎన్ఎంలు, సీహెచ్‌వోలకు శిక్షణ అందించాలని సూచించారు. స్ర్కీనింగ్‌లు నిర్వహించి సంబంధిత మెడికల్ ఆఫీసర్‌లకు రిఫర్ చేయాలన్నారు. గ్రామ స్థాయిలో కేన్సర్ స్ర్కీనింగ్ విజయవంతం చేసేందుకు వైద్య నిపుణులు కృషి చేయడంతో పాటు అందుకు తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని డాక్టర్ వెంకటేశ్వర్ కోరారు. అనంతరం ఆయన వైద్య నిపుణులతో కలిసి ఆస్పత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించారు. ఆయన వెంట రాష్ట్ర నోడల్ అధికారులు శ్యామల, రాజ్‌కిరణ్, ఆస్పత్రి డైరెక్టర్ ఉమేశ్‌మహంతి శెట్టి, డాక్టర్ రవితేజ, తదితరులు ఉన్నారు.

రాజీవ్‌గాంధీకి నేతల నివాళి

సింహాచలం, మే 21: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీకి కాంగ్రెస్ పార్టీ నాయకుడు పాసర్ల ప్రసాద్ తదితరులు మంగళవారం ఘనంగా నివాళులు అర్పించారు. రాజీవ్ గాంధీ 33వ వర్ధంతిని పురస్కరించుకుని సింహాచలంలో జరిగిన కార్యక్రమంలో ఆయన విగ్రహానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ చేసిన సేవలను శ్లాఘించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అభిమానులు, కుమార్, కామేశ్వరరావు, లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్ లైవ్ లింక్ ఇవ్వాలి

- ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు కేఏ పాల్ డిమాండ్



విశాఖపట్నం, మే 21 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల(ఈవీఎం)ను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ భద్రతపై తమకు అనుమానాలు ఉన్నందున, వాటికి పోలీసులు ఏర్పాటుచేసిన సీసీ టీవీ కెమెరాల లైవ్ లింక్‌ను ఇవ్వాలని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు కేఏ పాల్ డిమాండ్ చేశారు. విశాఖపట్నం పార్లమెంటు స్థానానికి పోటీ చేసిన స్వతంత్ర అభ్యర్థులతో కలిసి ఆశీల్‌మెట్ట కన్వెన్షన్ సెంటర్‌లో ఆయన మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, లైవ్ లింక్‌తో పాటు సీసీ టీవీ ఫుటేజ్ కూడా ఇవ్వాలన్నారు. గతంలో ఇలా ఇచ్చేవారని, ఇప్పుడు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఓట్ల లెక్కింపు రోజున అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని పోలీసు శాఖను కోరారు. విశాఖపట్నం పార్లమెంటుకు తాను పోటీ చేశానని, తప్పకుండా గెలుస్తానని విశ్వాసం వ్యక్తంచేశారు.

ఉక్కు డైరెక్టర్ (ఆపరేషన్స్)గా పురుషోత్తమన్

ఉక్కుటౌన్‌షిప్, మే 21: స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (ఆపరేషన్స్)గా సలీమ్ జి పురుషోత్తమన్‌ను పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ సెలక్షన్ బోర్డు (పీఈఎస్‌బీ) ఎంపిక చేసింది. ఈ పోస్టు ఖాళీగా ఉండడంతో మంగళవారం ఢిల్లీలో జరిగిన ఇంటర్వ్యూకు స్టీల్‌ప్లాంట్ నుంచి ఆరుగురు, సెయిల్ నుంచి ఇద్దరు. బైత్‌వైట్, ఎన్టీపీసీ, సెంట్రల్ కోల్ ఫీల్డ్స్, ఇండియన్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ సర్వీస్ నుంచి ఒకరు చొప్పున మొత్తం 12 మంది హాజరయ్యారు. వీరిలో బైత్‌వైట్ అండ్ కో లిమిటెడ్ సంస్థలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న సలీమ్ జి పురుషోత్తమన్ ఎంపికైనట్టు పీఈఎస్‌బీ పేర్కొంది.

నేడు భీమిలిలో వ్యాసరచన పోటీలు

భీమునిపట్నం, మే 21: జగద్గురువు ఆదిశంకరాచార్యుని జీవితవిశేషాలపై ఈ నెల 22న భీమిలిలో వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నామని ఆదర్శ హిందీ ప్రేమి మండలి వ్యవస్థాపక అధ్యక్షుడు కృష్ణారావు తెలిపారు. బీచ్‌రోడ్డులోని జీఎస్ఆర్ భవన్‌లో బుధవారం మధ్యాహ్నం 3 నుంచి 4 గంటవరకూ తెలుగు, హిందీ మాధ్యమాల్లో పోటీలు జరుగుతాయన్నారు. వివరాలకు 8985647419 నంబరులో సంప్రదించాలన్నారు.

'పరిపాలనాదక్షుడు ఆచార్య సింహాద్రి'

సాగర్‌నగర్, మే 21: మహోన్నత పరిపాలనాదక్షుడు ప్రొఫెసర్ వైసీపీ సింహాద్రి అని అంబేడ్కర్ వర్సిటీ మాజీ ఉపకులపతి ఆచార్య వై.సుధాకర్ పేర్కొన్నారు. ఏయూ మాజీ ఉపకులపతి ఆచార్య సింహాద్రి విద్యాప్రగతికి చేసిన సేవలను గుర్తుచేసుకుంటూ నగరంలోని సాయిప్రియా బీచ్ రిసార్ట్స్‌లో మంగళవారం ప్రత్యేక సదస్సు జరిగింది. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సింహాద్రి ఉన్నత విద్యాప్రగతిలో చెరగని ముద్ర వేశారన్నారు. నాగార్జున వర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా వివిధ యూనివర్సిటీలకు సింహాద్రి వీసీగా పనిచేసి విద్యావ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టారన్నారు.

పెదగదిలిలో వికసించిన మే పుష్పం



ఆరిలోవ, మే 21: పెదగదిలి ఈశ్వర దేవీనగర్‌లో మే పుష్పం వికసించింది. మొక్కనాటిన ఐదేళ్లకు పూసిందని, సుమారు పదిరోజులు తాజా గా ఉంటుందని, ఏడాదికి ఒక సారి మాత్రమే పూస్తుందని ఇంటి యజమాని తెలిపారు.

సచివాలయాల్లో బీసీజీ వ్యాక్సిన్

మధురవాడ, మే 21: మధురవాడ, ఆనందపురం పీహెచ్‌సీల పరిధిలోని అన్ని గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రతి గురువారం బీసీజీ వ్యాక్సిన్ చేస్తామని టీబీ యూనిట్ ల్యాబ్ పర్యవేక్షకుడు వీరబ్రహ్మం తెలిపారు. సాగర్‌నగర్, రుషికొండ, పీఎంపాలెం, వాంబేకాలనీ, స్వతంత్రనగర్ కాలనీ, మిథిలాపురి వుడకాలనీ, విశాలాక్షినగర్, మారికివలస, బక్కన్నపాలెం అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లలోనూ వ్యాక్సిన్ వేస్తారన్నారు. ఆనందపురం మండలంలోని సచివాలయాలతో పాటు, హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లులో వ్యాక్సిన్ వేస్తారన్నారు.

ఘనంగా చిన్న పోలమాంబ ఆలయ వార్షికోత్సవం

మద్దిలపాలెం, మే 21: శివాజీపాలెంలో కొలువైన చిన్న పోలమాంబ అమ్మవారి వార్షిక మహోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచి అమ్మవారికి మంత్రోచ్చరణల నడుమ విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ నాయకులు అక్కరమాని వెంకటరావు, మాజీ కార్పొరేటర్ బొట్టా నీలిమ, బొట్టా వెంకటరమణ అమ్మవారికి పూజలు చేశారు.



అన్నదానం ప్రారంభిస్తున్న వెలగపూడి ప్రతాపరుద్ర



అమ్మవారికి పూజలు చేస్తున్న టీడీపీ నాయకులు

పోలమాంబకు విశేష పూజలు

ఆరిలోవ, మే 21: చినగదిలి నేతాజీనగర్, రామలక్ష్మణపురంలోని పోలామాంబ అమ్మవారి దేవాలయం నెల పండగ సందర్భంగా మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన చేపట్టారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు కుమారుడు వెలగపూడి ప్రతాప రుద్ర ముఖ్య అతిథిగా హాజరై భక్తులకు అన్నప్రసాదాల వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త రాయిని వెంకటప్పారావు, పోతిన భరత్, దీపక్, రామ్మూర్తి, తేజ తదితరులు పాల్గొన్నారు.

తగరపువలసలో అక్కరకురాని రైతుబజారు

- రహదారులపైనే కొనసాగుతున్న వ్యాపారాలు
- అవస్థల మధ్య నెట్టుకొస్తున్న చిరు వ్యాపారులు



తగరపువలస రోడ్డు మార్జిన్‌లో చిరు వ్యాపారుల దుకాణాలు

తగరపువలస, మే 21: తగరపువలసలో రైతు బజారు నిర్మాణం పూర్తయినా అక్కరకురాలేదు. రూ. లక్షలు వెచ్చించి నిర్మించిన ఈ బజారును రైతు లకు మాత్రంకేటాయించడంతో నిర్లక్ష్యం వెంటాడుతోంది. ప్రస్తుతం ఇది నిరుపయోగంగా మారింది. దీంతో వ్యాపారస్తులతా సంతలోనే తమ వ్యాపారా లుసాగించాల్సి వస్తోంది. రోజూ భీమిలి, ఆనందపురం, పద్మనాభం తదితర మండలాలనుంచి అనేకమంది చిరువ్యాపారులు, రైతులు ఇక్కడకు వస్తుంటారు. వీరికి స్థలాలు లేక డివైడర్లపైన వ్యాపారులు సాగించాల్సి వస్తోంది. దీంతో నిత్యం ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోంది. తాగునీరు, మరుగుదొడ్లు తదితర కనీస సదుపాయాలు లేక వీరంతానిత్యం ఇబ్బందులు పడుతున్నా రు. వ్యాపారులనుంచి ఆశీల వసూలు చేస్తున్నా, రశీదులు సక్రమంగా ఇ వ్వ డంలేదని పలువురు చెబుతున్నారు. వ్యాపారానికి ఎంత ఆశీలు వసూలు చేయాలన్న నిబంధనలు పాటించడం లేదు. సంతలో కానీ, ఈ కూడలిలోకానీ, ఆశీలు వసూలుకు సంబంధించిన సమాచారం ప్రదర్శించడంలేదు. చిన్న వ్యాపారుల నుంచి రూ. 11 మాత్రం వసూలు చేయాలని నిబంధన ఉన్నా తమకు నచ్చినంత వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రశీదులు అడిగినే వేధింపులు ఎదురవుతున్నాయని, ఇచ్చినా తక్కువ మొత్తంలో చూపుతున్నట్టు వ్యాపారులు చెబుతున్నారు. జీవీఎంసీ అధికారులు ఏ వ్యాపారానికి ఎంత అనే విషయాన్ని బోర్డుల ద్వారా ప్రదర్శిస్తే సమస్యలు రావని పలువురు అభి ప్రాయం వ్యక్తంచేస్తున్నారు. అలాగే, రైతు బజారును ప్రారంభిస్తే అనేక సమస్యలకు పరిష్కారం లభిస్తుందని చెబుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ హెచ్‌సీ దుర్మరణం



వెంకటపతిరాజు మృతదేహం

తగరపువలస, మే 21: రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ హెడ్‌కానిస్టేబుల్ దుర్మరణం చెందారు. ఈ సంఘటన తగరపువలస జాతీయ రహదారి సర్వీసు రోడ్డులో వలందపేట వద్ద మంగళవారం ఉదయం జరిగింది. ఎస్ఐ కె.హరీశ్ తెలిపిన వివరాల మేరకు... దండు వెంకటపతిరాజు (64) 2018లో హెడ్ కానిస్టేబుల్‌గా పదవీ విరమణ చేశారు. కుమారుడు మనోజ్‌కుమార్ లండన్‌లో చదువుకుంటున్నాడు. వీరి కుటుంబం తాళ్లవలస రాజేష్ రెసిడెన్సీలో నివాసముంటోంది. గ్రామ దేవత పండగ నేపథ్యంలో పూజా సామగ్రి కొనుగోలు చేసేందుకు మంగళవారం ఉదయం సంగివలస మూడు గుళ్ల అమ్మవార్ల సెంటర్‌కు వెంకటపతిరాజు స్కూటీపై వెళ్లారు. తిరిగి ఇంటికి వెళ్తుండగా ఆయన ద్విచక్రవాహనాన్ని వలందపేట వద్ద ఎదురుగా విశాఖ నుంచి వస్తున్న కారు బలంగా ఢీకొని కొంతదూరం ఈడ్చుకు పోయింది. ఈ ప్రమాదంలో తలకు తీవ్రమైన గాయమైన వెంకటపతిరాజు అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం తెలుసుకుని కుటుంబ సభ్యులు ప్రమాద స్థలానికి చేరుకున్నారు. కారు డ్రైవర్ అనకాపల్లి జిల్లా చోడవరానికి చెందిన వర్రి నందకృష్ణను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుని కుమార్తె రుద్రరాజు సాయిలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ హరీశ్ తెలిపారు.

బైక్ అదుపుతప్పి విద్యార్థి మృతి



భరత్‌రాజ్ మృతదేహం

పెందుర్తి, మే 21: ఇంజనీర్ కావాలన్న కల సాకారం కాకుండానే ఓ విద్యార్థి రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. చీమలాల్లిలో జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించి సీఐ ఎల్.రామకృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పినగాడికి చెందిన రవిరాజ్ అనే వ్యక్తి గ్యాస్ కంపెనీలో పని చేస్తున్నాడు. ఆయన కుమారుడు అమృత్ భరత్‌రాజ్ (18) ఇటీవలే ఇంటర్ పూర్తి చేసి ఇంజనీరింగ్‌లో ప్రవేశం కోసం సిద్ధమవుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ద్విచక్ర వాహనంపై తమ ఇంటి నుంచి పినగాడి మీదుగా వేపగుంట బయలుదేరాడు. మార్గమధ్యంలో చీమలాపల్లి రోడ్డుపై గల పెద్ద గోతిలో బైక్ పడడంతో కుదుపునకు అదుపు తప్పి కింద పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు సహకారంతో భరత్‌రాజ్‌ను 108లో కేజీహెచ్‌కు తరలిస్తుండగా మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

26న గీతం ఎంట్రన్స్ టెస్ట్

సాగర్‌నగర్, మే 21: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్ ద్వారా నిర్వహిస్తున్న డిగ్రీ, పీజీ కోర్సులలో ప్రవేశానికి ఈనెల 26న గీతం అడ్మిషన్ టెస్ట్ (గ్యాట్) నిర్వహిస్తున్నట్టు స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వేదవతి తెలిపారు. బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, ఎలక్ట్రానిక్స్, మైక్రోబయాలజీ, ఫిజిక్స్, మేథ్స్, స్టాటిస్టిక్స్, ఫుడ్‌సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్‌లో నాలుగేళ్ల బీఎస్సీ, మూడేళ్ల బీసీఏ, అప్లైడ్ మేథ్స్, బయోకెమిస్ట్రీ అండ్ మాలిక్యులర్ బయాలజీ, డేటా సైన్స్, బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, ఎలక్ట్రానిక్స్, మైక్రోబయాలజీ, ఫిజిక్స్, స్టాటిస్టిక్స్, ఫుడ్‌సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్‌లో రెండేళ్ల ఎమ్మెస్సీ ఎంసీఏలో ప్రవేశానికి ఈనెల 24లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అప్పన్నను దర్శించుకున్న ఒడిశా దాసుడు



పరివారంతో ఆలయంలో దాసుడు

సింహాచలం, మే 21: వరాహలక్ష్మీనృసింహస్వామిని ఒడిశాకు చెందిన లక్ష్మీకాంత్ నాయకోదాసుడు మంగళవారం ఉదయం కుటుంబసభ్యులు, శిష్యపరివారంతో దర్శించుకున్నారు. ఆలయ కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని, బేడామండప ప్రదక్షిణలు చేసిన తరువాత అంతరాలయంలో పూజలు జరిపించారు. స్వామికి ప్రీతికరమైన సుగంధ పరిమళభరిత సంపెంగలు, మల్లెలు, విరజాజులతోపాటు, మామిడి అరటి పండ్లను సమర్పించారు. అనంతరం గోదాదేవి అమ్మవారిని దర్శించుకున్నారు.

వృద్ధుడికి రోబోటిక్ ద్వారా శస్త్రచికిత్స



కోలుకున్న వృద్ధుడితో ఆస్పత్రి సిబ్బంది

వెంకోజీపాలెం, మే 21: రోబోటిక్ ద్వారా 76 ఏళ్ల వృద్ధుడికి అధునాతన శస్త్రచికిత్స చేసి ప్యాంక్రియాటిక్ (క్లోమ గ్రంథి) వద్ద కణితి తొలగించి మెడికవర్ ఆస్పత్రి వైద్యులు ప్రాణాలు కాపాడారు. కణితి కారణంగా తరచూ కామెర్లు వస్తున్నాయని గుర్తించిన వైద్యులు వయసును అనుసరించి రోబోటిక్ సర్జరీని నిర్వహించి కణితిని తొలగించారు. రోగి రోజువారీ కార్యకలాపాలను తిరిగి ప్రారంభించారని శస్త్రచికిత్స గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు డాక్టర్ బి.బి.దాస్ తెలిపారు. ఇటువంటి వాటికి చికిత్స చేయాలంటే ఓపెన్ సర్జరీ (పెద్ద కోతతో) నిర్వహించాలని, దీని వలన చాలా రక్తం పోవడం, ఎక్కువ రోజులు ఆస్పత్రిలో ఉండాల్సి వస్తుందన్నారు. కానీ ఈ రకమైన సంక్లిష్ట సర్జరీలు మంచి ఫలితాలు అందిస్తాయని తెలిపారు. దీనివల్ల శారీరక గాయాన్ని తగ్గించడమే కాకుండా రికవరీ ప్రక్రియను వేగవంతం చేస్తుందన్నారు. అధునాతన సాంకేతిక కీహోల్ రోబోటిక్స్ సర్జరీస్‌తో, అనుభజ్ఞులైన డాక్టర్‌లతోనే ఇటువంటివి సాధ్యమని వివరించారు. వైద్యులకు, సిబ్బందికి రోగి, బంధువులు ధన్యవాదాలు తెలిపారు.